RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 239 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శుక్రవారం 03-04-2026 పేజీలు : 12 వెల: 1-00

## పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

- ●నేటి నుంచే ఈ విధానం అమలు
- ●23 సింగల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం మిగతా 2లో..

## సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

2047 విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకెళుతున్న సిఎం

తుమ్మలూరు గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభ ముఖ్య ఉద్దేశం అని సి.ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళు ,, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, మిగతా 2లో..



# రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు

### సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి . సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి మిగతా 2లో..

## నా చేతుల్లో ఏం లేదు

అధికారులను నిర్బంధించడంపై సీఎం మమతా



**కలకత్తా, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్ లో 'సర్' విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించడంపై తీవ్ర దుమారం రేగుతోంది. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. అధికారుల నిర్బంధం విషయం తనకు తెలియదన్నారు. ప్రస్తుతం పరిపాలన తన చేతుల్లో లేదని వ్యాఖ్యానించారు. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడుతూ.. 'దీనికి బాధ్యులు ఎవరో నాకు తెలియదు. దీని గురించి నాకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. పరిపాలన నా చేతుల్లో మిగతా 2లో..

## జగన్ వ్యాఖ్యలపై జనం నవ్వుకుంటున్నారు

రాష్ట్రాలకు రాజధాని ఉండదనడం మూర్ఖత్వమే: రాజ్యసభలో జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ లక్ష్మణ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** రాజధాని అమరావతి విషయంలో వైసీపీ తీరును ముఖ్యంగా జగన్ వ్యాఖ్యలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు రాజధాని గురించి చట్టంలో ఉందా? అని ఆ పార్టీ అధినేత జగన్ ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా 'మావిగన్' అనే పేరు తీసుకొచ్చారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. దాంతో పిల్ల కాంగ్రెస్ పిల్ల చేష్టలకు ప్రపంచం నివ్వెర పోయిందని ఎద్దేవా చేశారు. పిల్ల చేష్టలతో రాజధాని అంశంలో వైసీపీ మూడుముక్కలాట ఆడిందని మండిపడ్డారు. ఎన్నికల్లో పిల్ల కాంగ్రెస్, తల్లి కాంగ్రెస్‌ను ప్రజలు మట్టి కరిపించారని గుర్తు చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదంపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కె.లక్ష్మణ్ మాట్లాడారు. దేశ భాషలందు తెలుగులెస్స అంటూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అమరావతి కోసం సుదీర్ఘ పోరాటం చేసిన రైతులకు నమస్కారాలు తెలిపారు. తెలుగు జాతి చరిత్ర అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేసి.. ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. రాజధాని కోసం 29 వేల మందికిపైగా రైతులు తమ భూములు ఇచ్చారని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణను గతంలో కొంతమంది ప్రముఖులు విలీనం చేశారని ఎంపీ కె.లక్ష్మణ్ గుర్తు చేశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వాలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ క్రమంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకు ప్రజలను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని అన్నారు. చొక్కాలు మార్చినట్లుగా సీఎంలను కాంగ్రెస్ పార్టీ మార్చిందని మిగతా 2లో..

## దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రం

పాకిస్థాన్‌కు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక



**తిరువనంతపురం, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్‌ను భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పరోక్షంగా హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఉగ్ర చర్యలపై మిగతా 2లో..

## అమరావతికి ఆమోదముద్ర

- ■రాజ్యసభలోనూ ఏకగ్రీవం
- ■బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
- ■రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఎపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి మిగతా 2లో..

## కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

❑కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం ❑ఎటిఎంలా ప్రాజెక్ట్ను వాడుకున్న కెసిఆర్

❑ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్ ❑అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్

❑రాజ్యసభలో సురేష్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాలేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాలేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాలేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ మిగతా 2లో..

## నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

- ■పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక
- ■మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



**రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మితాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయిలు**

## దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రం

గతంలో దీటుగా బదులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న వేళ రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ప్రస్తుత పరిస్థితుల్లో మన పొరుగు దేశం ఏవైనా కవ్వింపు చర్యలకు పాల్పడవచ్చు. ఒకవేళ అదే జరిగితే.. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

## జగన్ వ్యాఖ్యలపై జనం నవ్వుకుంటున్నారు

చెప్పారు. తెలుగు ప్రజల కోసం ఎన్టీఆర్ పార్టీ స్థాపించారన్నారు. కాంగ్రెస్ విధానాలపై ఎన్టీఆర్ పోరాటం చేశారని గుర్తు చేశారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఎన్టీఆర్ కృషి చేశారని ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. బీసీలు, అట్టడుగు వర్గాలకు అవకాశాలు కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చడంలో చంద్రబాబు పాత్ర మరువలేనిదన్నారు. విభజన తర్వాత అమరావతి కోసం చంద్రబాబు సంకల్పం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. రాజధాని ఏర్పాటు సందర్భంగా పార్లమెంట్ నుంచి మట్టి, పవిత్ర జలాలను అమరావతికి ప్రధాని మోదీ తెచ్చారన్నారు. ఏపీకి అండగా ఉంటామని భరోసా ఇస్తూ అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని తెలిపారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాజధానిని ఎవరూ మార్చకుండా పార్లమెంట్‌లో చట్టం తెస్తున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వివరించారు.

## నా చేతుల్లో ఏం లేదు

లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తుంది. వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట వింటున్నారు. అధికారులందరినీ మార్చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సమగ్ర సర్వేపై ప్రజలు కోపంగా ఉన్నారని మమతా వ్యాఖ్యానించారు. మాల్దాలో జరిగిన ఘటన భాజపా కుట్రలో భాగమని ఆరోపించారు. వారిని ఓటమి భయం వెంటాడుతుందన్నారు. అందుకే.. అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కాషాయ పార్టీ భావిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపైనా ఆమె విరుచుకుపడ్డారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో వారు విఫలమయ్యారన్నారు. కాగా.. ఈ విషయంపై స్పందించిన అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనపై సీబీఐ లేదా ఎన్ఐఏతో దర్యాప్తు చేసేందుకు ఈసీకి అనుమతిచ్చింది.

## నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

అందే వరకు ఈ పక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు. .తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం అన్నారు.

## కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

## సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం



కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని సి.ఎస్ అన్నారు. కళ్యాణ్ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

**(మొదటి పేజీ తరువాయి)**

సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్ధతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

# అమెరికా అవమానపడేవరకు యుద్ధం: ఇరాన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని.. వారి నాయకత్వాన్ని తీవ్ర స్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ సైన్యం దీటుగా స్పందించింది. తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని స్పష్టం చేసింది. అంతేకాదు.. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి చేసిన ప్రకటనను అక్కడి అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తిస్థాయి సమాచారం లేదని ఇరాన్ పేర్కొంది.

వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతోపాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామన్న ట్రంప్ వాదనలను ఖండించింది. మరోవైపు, ఇరాన్‌ను రాతియుగంలోకి పంపిస్తామని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించింది. రాతియుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి అమెరికా తీసుకొస్తోందని.. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలను ఆధునిక ప్రపంచంలోకి తెస్తోందని దుయ్యబట్టింది.

**భారత మిత్రులు సురక్షితంగానే**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత మిత్రులు సురక్షితంగానే ఉన్నారని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని పేర్కొంది. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అంతకుముందు.. హార్మూజ్ భవిష్యత్తును ఇరాన్, ఒమన్‌లు మాత్రమే నిర్ణయిస్తాయని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. దక్షిణాఫ్రికా పౌరులు సురక్షితమేనని పేర్కొంటూ పోస్టు చేయగా.. దీనికి భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం స్పందించింది.

# అమరావతికి ఆమోదముద్ర

**(మొదటి పేజీ తరువాయి)**

సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లు పై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాజధాని అమరావతి బిల్లును ఇటీవల కేంద్రానికి పంపారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందడంతో.. రాజ్యసభకు పంపారు. ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలు ఆమోదం పొందడంతో.. ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపనున్నారు.

# పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

**(మొదటి పేజీ తరువాయి)**

తీసుకున్నారు. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎగ్జిబిటర్లకు రెవెన్యూ షేర్ ఇలా.. సినిమా ప్రదర్శితమైన తొలివారం 60 శాతం, రెండోవారం 50 శాతం, మూడోవారం 40 శాతం. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటన విడుదల చేసింది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఇటీవల సంప్రదించి.. తెలంగాణలోని పలువురు అగ్ర శ్రేణి డిస్ట్రిబ్యూటర్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి థియేటర్లు ముఖ్యమైన ప్రదేశాల్లో ఉన్న ప్రీమియం థియేటర్లని, వాటిలో ప్రేక్షకులకు అన్ని సౌకర్యాలున్నాయని, అయితే ఈ థియేటర్ల నిర్వహణకు చాలా ఖర్చవుతోందన్నారు. ప్రస్తుత అద్దె విధానంతో వారు మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శిస్తామన్న తమ ప్రపోజల్‌ను డిస్ట్రిబ్యూటర్లు అంగీకరించారని చెప్పారు. శశిధర్ రెడ్డి మాత్రమే నిర్మాతలు, ఇతర భాగస్వాములతో మరింత చర్చించి, ఆ తర్వాత అభిప్రాయం చెబుతామన్నారని పేర్కొన్నారు. ఇకపై తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో సినిమాలను కేవలం శాతం ప్రాతిపదికనే ప్రదర్శిస్తామని, ఇది విడతల వారీగా జరుగుతుందని ఎగ్జిబిటర్లు తెలిపారని ఫిల్మ్ ఛాంబర్ ప్రకటనలో పేర్కొంది. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత ఎగ్జిబిటర్ల సమావేశం లోనూ దీనిపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మన తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల సింగిల్ స్క్రీన్‌లు పర్సంటేజీ విధానాన్ని మాత్రమే అనుసరిస్తున్నాయి. సింగిల్ స్క్రీన్‌ల మనుగడ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని డిస్ట్రిబ్యూటర్లు, సినీ నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. రెంటల్ విధానానికి బదులు పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన కోసం ఎప్పటి నుంచో ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 23 థియేటర్ల యాజమాన్యాలు ముందడుగు వేశాయి.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

### అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?... కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సంపులో పడి చిన్నారి మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నార్సింగిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గండిపేటలో ఎనిమిది నెలల పసికందు సంపులో పడి మృతి చెందింది. ఆడుకుంటూ ఇంటి బయటికి వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు సంపు దగ్గరకు వెళ్లేలోపే నీటిలో మునిగిపోయింది. సంపులో నుంచి చిన్నారిని బయటకు తీసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీగా విలపించారు. పొట్ట చేత పట్టుకుని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు.. గండిపేటలో జీవనం సాగిస్తున్నారు. అప్పటి వరకు ఆడుకుంటున్న తమ చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## క్యాటరింగ్ పేరుతో దగుల్బాజీ పనులు

### ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చేసేది క్యాటరింగ్ పనే ఐనా..చాటుమాటుగా కంత్రీ పనులు చేస్తున్నాడో కేటుగాడు. ఫంక్షన్లకు క్యాటరింగ్ ఫుడ్ సప్లై చేస్తూ.. ముందుగా మాట్లాడుకున్న దాని కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఎందుకుని ప్రశ్నిస్తే ఫంక్షన్లో దొంగచాటుగా మహిళల ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి వేధిస్తున్నాడు. సికింద్రాబాద్ అడ్డాగా క్యాటరింగ్ చాటున కంత్రీ పనులకు పాల్పడుతున్న కేటుగాడిని పోలీసులు పట్టుకున్నారు . సికింద్రాబాద్ పరిధిలోని మోండా మార్కెట్‌కి చెందిన వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్ స్థానికంగా క్యాటరింగ్ బిజినెస్ చేస్తున్నాడు. మీటింగ్‌లు, ఫంక్షన్లకు ఫుడ్ సప్లై చేయడమే కాకుండా, వడ్డించేందుకు క్యాటరింగ్ బాయ్స్‌ను కూడా సప్లై చేస్తుంటాడు. మోండా మార్కెట్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి తన ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్ కోసం అంజి కిరణ్ వద్ద క్యాటరింగ్ ఆర్డర్ ఇచ్చాడు. ఆర్డర్ బుకింగ్ సమయంలోనే ప్లేట్ భోజనానికి ఎంత ఛార్జ్ అవుతుంది? ఎన్ని ప్లేట్లు తెస్తారు? ఎంతమంది క్యాటరింగ్ బాయ్స్ వస్తారు? వాళ్లకు ఎంత ఇవ్వాలి? అనేది మాట్లాడుకున్నారు. తీరా ఫంక్షన్ ముగిసిన తర్వాత అంజి కిరణ్ అదనంగా బిల్లు వేశాడు. ఏవేవో ఛార్జీల పేరుతో అదనంగా డబ్బులు డిమాండ్ చేశాడు. ఎందుకు ఇవ్వాలి అని అడిగితే గొడవ పెట్టుకున్నాడు. అసభ్యంగా దూషించాడు. ఫంక్షన్ జరుగుతున్న సమయంలో ఫంక్షన్‌కి అటెండ్ అయిన మహిళల ఫొటోలు తీశానని? వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిలింగ్‌కి దిగాడు. దీంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. అంజి కిరణ్‌పై ఫిర్యాదు చేశారు. వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పోలీసులు. ఇదే తరహాలో పలుచోట్ల బెదిరింపులకు, వేధింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు దిగినట్లు గుర్తించారు పోలీసులు. గతంలో ఇలాంటివే రెండు కేసులు కూడా నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. అంజి కిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## చికెన్ షాపులకు 40 మార్జిన్ ఇస్తున్నాం

- కొందరు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారు
- బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చికెన్ రేటు మార్జిన్ విషయంలో చికెన్ రిటైల్ షాపు వ్యాపారులు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ తెలిపింది. రిటైల్ షాపుల ఆరోపణలపై హైదరాబాద్ సోమాజిగూడాలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు రామిరెడ్డి , బాలసుబ్రహ్మణ్యన్ , రాజిరెడ్డి లు మాట్లాడారు. చికెన్ లైవ్ రేట్ తో పాటు రిటైల్ ధరలను పేపర్ ద్వారా ప్రకటనలు ఇస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా కిలోకు 40 రూపాయలు మార్జిన్ ఇస్తున్నామని , కరోనా సమయంలో కూడా అంతే ఇచ్చామని తెలిపారు. బంద్ లో ఉన్న వ్యాపారులు కిలోకు 30 రూపాయలు అడుగుతున్నారని... తాము 40 ఇస్తున్నామన్నారు. కొందరు కావాలనే వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కంపెనీలు నష్టాల్లో ఉన్నా కస్టమర్ పై భారం పడకుండా రేటును నిర్ణయిస్తున్నామని తెలిపారు. రిటైల్ వ్యాపారులతో తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, వారికి వస్తున్న మార్జిన్ పై వివరించి చెబుతామని అన్నారు. మరోవైపు చికెన్ పై మార్జిన్ పెంచి, న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ చేస్తున్న బంద్ రెండో రోజుకు చేరుకుంది. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రకటిస్తున్న రిటైల్ అసోసియేష్ సభ్యులు.. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ పెంచేవరకూ నిరవధిక బంద్పాటిస్తామని హెచ్చరించింది. చికెన్ పై మార్జిన్ ఇవ్వకపోవడం పౌల్ట్రీ కంపెనీల తీరుకు నిరసనగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, గోపి, యాదగిరి, వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల 26 శాతం ఉన్న మార్జిన్ ను పౌల్ట్రీ కంపెనీలు16 శాతానికి తగ్గించాయని, దీనివల్ల చికెన్ షాపుల నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మైలార్‌దేవ్‌పల్లిలో గంజాయి గ్యాంగ్ ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. స్థానికంగా ఉంటున్న వారి పట్ల ఈ గ్యాంగ్ అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దాడులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోంది. తాజాగా మరోసారి రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్ ఓ యువకుడిపై విచాక్షణారహితంగా దాడి చేసింది. శాస్త్రీపురంలో ఫహాద్ అనే యువకుడిపై కత్తులు, రాడ్స్‌తో దాడి చేసింది గంజాయి బ్యాచ్. తీవ్రంగా గాయపడిన ఫహాద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అయితే యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఫహాద్‌పై ఈ గ్యాంగ్ దాడి చేసినట్లు తెలుస్తోంది. షానవాజ్, షాబాజ్‌తో పాటు మరో ముగ్గురు దాడి చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో యువకుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

## ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

### అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా సమ్మక్క సారలమ్మలు

### ఒకటైన మేడారం సమ్మక్క సారలమ్మల జాతర




భారతదేశంలోనే అరుదైన జాతరలలో ఒకటైన మేడారం సమ్మక్క సారలమ్మల జాతర రెండేండ్లకొకసారి జరిగే గిరిజనోత్సవంగా ప్రసిద్ధి చెందింది. ప్రస్తుత ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో జరిగే 'సమ్మక్క- సారలమ్మ' జాతరకు ఎంతో విశిష్టత ఉంది. ఆదివాసీల శౌర్యానికి, సంప్రదాయాలకు కట్టుబాట్లకు నిదర్శనంగా మారింది ఈ పండుగ. గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా సమ్మక్క సారలమ్మలు చరిత్రలో నిలిచిపోయారు.ఆ ఆచారం విశ్వవ్యాప్తమై నేడు గిరిజనులే కాక గిరిజనేతరులు ఇతర రాష్ట్రాల వారు తరలివచ్చి మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. ఇలా భిన్న సంస్కృతుల కూడలిగా మారిన మేడారం చిత్రాలివి..

# ఒక స్పూన్ నూనెతో పేలు టప టప రాలిపోతాయి

### జీవితంలో పేల సమస్య ఉండదు

తలలో పేలు ఈలు ఉన్నాయంటే విపరీతమైన దురద వస్తుంది. అలాగే చాలా చికాకుగా ఉంటుంది. పేలను తగ్గించటానికి ఒక మంచి చిట్కా తెలుసుకుందాం. ఈ చిట్కా చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది. పేల సమస్యను తగ్గించడానికి వేప నూనె చాలా బాగా సహాయపడుతుంది. వేప నూనెను పురాతన కాలం నుండి జుట్టు సంరక్షణలో వాడుతున్నారు. వేప నూనెను కొంచెం తీసుకుని తలకు బాగా పట్టించి ఒక పది నిమిషాల తర్వాత దువ్వెనతో దువ్వితే పేలు అన్ని చనిపోయి రాలిపోతాయి. ఆ తర్వాత షాంపూ లేదా కుంకుడు కాయతో తల రుద్దుకుంటే సరిపోతుంది. వేప నూనెలో నింబిడిన్ అనే క్రియశీల పదార్థం ఉండటం అలాగే యాంటీ ఫంగల్ లక్షణాలు ఉండటం వలన చుండ్రు వంటి సమస్యలు లేకుండా చేస్తుంది. జుట్టు సంరక్షణకు అవసరమైన పోషకాలు ఎన్నో ఉంటాయి. వేపనూనె మార్కెట్లో లభ్యమవుతుంది లేదా మనం ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. వేప నూనె జుట్టుకు కండీషనర్ వలె పనిచేస్తుంది. జుట్టు రాలకుండా జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి కూడా సహాయపడుతుంది. జుట్టు సమస్యలకు వేప నూనె మంచి పరిష్కారం అని చెప్పవచ్చు. వేప నూనెను మూడు రోజులు రాస్తే పేల సమస్య, చుండ్రు సమస్య తగ్గటమే కాకుండా జుట్టు రాలే సమస్య కూడా తగ్గిపోతుంది. వేపలో ఉండే విటమిన్ %జు%, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ కణాల పునరుత్పత్తిలో సహాయపడి ఆరోగ్యకరమైన స్కాల్ప్ ను ప్రోత్సహిస్తుంది.



# ఉల్లిపాయతో ఇలా చేస్తే జుట్టు రాలే సమస్య ఉండదు

### చుండ్రు తగ్గి జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది






మారిన జీవనశైలి పరిస్థితులు, వాతావరణంలో కాలుష్యం కారణంగా జుట్టుకు సంబంధించిన ఎన్నో రకాల సమస్యలు వస్తున్నాయి. చాలామంది జుట్టు రాలే సమస్య., చుండ్రు సమస్యలు వచ్చినప్పుడు మార్కెట్లో దొరికే రకరకాల ప్రొడక్ట్స్ వాడేస్తూ ఉంటారు. ఇంటిలో దొరికే .సహజ సిద్ధమైన పదార్థాలతో జుట్టు రాలే సమస్యను తగ్గించుకోవచ్చు. చిన్న ఉల్లిపాయన పేస్టుగా తయారు చేసుకోవాలి. ఒక బౌల్ లో ఉల్లిపాయ పేస్ట్, రెండు స్పూన్ల ఆలివ్ ఆయిల్, ఒక స్పూన్ ముదం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు బాగా పట్టించాలి. జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకూ పట్టించాలి. ఒక అరగంట అలా వదిలేయాలి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కుంకుడు కాయలతో తలస్నానం చేయాలి. . ఈ విధంగా వారంలో రెండు సార్లు చేస్తూ ఉంటే జుట్టుకి సంబంధించిన సమస్యలు జుట్టురాలే సమస్య, చుండ్రు వంటి అన్ని రకాల సమస్యలు తొలగిపోతాయి. అంతే కాకుండా తెల్ల జుట్టు నల్లగా మారుతుంది. ఉల్లిపాయ చర్మంలో రక్త ప్రసరణను పెంచి జుట్టు పెరుగుదల మరియు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. బాదం నూనెలో ఉండే లక్షణాలు జుట్టు బలంగా మృదువుగా మెరవడానికి సహాయపడతాయి. ఆముదంను పురాతన కాలం నుండి జుట్టు సంరక్షణలో ఉపయోగిస్తున్నారు. ఈ మిశ్రమం చాలా సమర్థవంతంగా పనిచేస్తుంది. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా జుట్టు రాలే సమస్యను, చుండ్రును తగ్గించుకోవచ్చు.

# బాత్‌రూమ్, కిచెన్ సింక్‌లో నుంచి నీరు పోవట్లేదా, ఉప్పు ఒక్కటి చాలు

ఇంట్లోని బాత్‌రూమ్స్, వాష్ బేసిన్, కిచెన్‌లోని సింక్ ఎప్పటికప్పుడు క్లీన్ చేసినప్పటికీ కొన్నిసార్లు అందులో నుంచి నీ రు పోవు. దీనికి కారణం వాటిలోపల జిడ్డు, బ్యాక్టీరియా పేరుకుపోవడమే. ఇలా నీరు నిల్చినప్పుడు ఎంత ఫోర్స్‌తో మనం నెట్టినా కూడా నీరు పోదు. అలాంటప్పుడు మన ఇంట్లోని ఉప్పునే డ్రెయిన్ క్లీనర్‌లా వాడొచ్చు. దీనిని ఉపయోగించిన డ్రెయిన్‌లోని జిడ్డుని బ్యాక్టీరియా, దుమ్ము ధూళి కణాలను దూరం చేయొచ్చు. అందుకోసం ఉప్పుని ఎలా వాడాలో తెలుసుకోండి.

**కావాల్సిన పదార్థాలు:** ఉప్పు, వేడి నీరు

వంటల్లో వాడే ఉప్పు ఇంట్లో ఎన్నో పనులని చేస్తుంది. బాత్‌రూమ్, వాష్ బేసిన్, సింక్ ఎక్కడైనా నీరు నిల్చిపోతుంటే మన పనులకి ఆటంకంగా మారుతుంది. దీనికి చెక్ పెట్టేందుకు ముందుగా డ్రెయిన్ దగ్గర ఉప్పు ఎక్కువగా వేయండి. ఆ హెూల్స్ నుంచి లోపలికి వెళ్లాలి. వేసిన తర్వాత కనీసం అరగంట అలానే ఉంచండి. తర్వాత వేడి వేడి నీటిని పోయండి. అంతే చాలా వరకూ సమస్య పరిష్కారమవుతుంది. డ్రెయిన్ చక్కగా క్లీన్ అయి నీరంతా వెళ్లిపోతుంది. ఉప్పు డ్రెయిన్ క్లీన్ చేసే పవర్‌ఫుల్ పదార్థమని చెప్పొచ్చు. ఉప్పు ద్రవత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, చెత్త, అవశేషాలను విచ్ఛిన్నం చేస్తుంది. ఆ తర్వాత మనం వేడి వేడి నీరు పోయగా అవన్నీ కిందికి వెళ్లిపోతాయి. ఈ నేచురల్ రెమిడీతో డ్రెయిన్ మొత్తం క్లీన్‌గా మారతుంది. బాత్‌రూమ్‌తో పోలిస్తే సింక్, వాష్ బేసిన్‌లో నీరు ఎక్కువగా నిలిచిపోతుంది. దీనికి కారణం బాత్‌రూమ్‌లో మనం వేడినీటిని వాడతాం. కానీ, వీటిలో వాడాం. దీంతో వ్యర్థాలన్నీ పేరుకుపోతాయి. అలా కాకుండా ఉండేందుకు కనీసం వారానికి ఓసారైనా ఉప్పు వేయకపోయినా పర్లేదు వేడినీటిని పోయండి. 15 రోజులకి ఓ సారి ఉప్పు వేసి వేడి నీటిని పోయండి. దీంతో నేచురల్‌గానే డ్రెయిన్ క్లియర్ అవుతుంది. మనం బాత్‌రూమ్‌ని రెగ్యులర్‌గానే క్లీన్ చేసినప్పటికీ బాత్‌రూమ్‌లో స్నానం చేస్తాం, ఇతర కార్యక్రమాలన్నీ చేస్తాం. కాబట్టి డ్రెయిన్ నుంచి నీరు త్వరగా వెళ్లదు. దీనికి కారణం మనం రెగ్యులర్‌గా వాటిని వాడినప్పుడు తలకి రాసిన నూనె, ఒంటినుండి వచ్చే జిడ్డు వంటివి డ్రెయిన్‌లో పేరుకుపోతాయి. దీంతో డ్రెయిన్ ఇరుగ్గా మారి నీరు నిలిచిపోతుంది. దీంతో ఎంత క్లీన్ చేసినా నీరు పోదు. అందుకే, నెలకి ఒకటి రెండుసార్లైనా ఇప్పుడు చెప్పిన టిప్‌ని ఫాలో అవ్వండి.





# సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

### బిల్లు తీసుకు రాబోతున్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, ఏప్రిల్2 (ఆర్ఎన్ఎ):** సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# మూడుముక్కలాటతో అమరావతికి ద్రోహం

### జగన్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి పెమ్మసాని

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** అమరావతి అంటే తనకు ఎమోషన్ అని.. అందుకే తెలుగులో మాట్లాడతున్నాని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లోక్‌సభలో అమరావతి బిల్లుపై చర్చలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. బిల్లుపై మాట్లాడటం అమరావతి బిడ్డగా గర్విస్తున్నట్లు తెలిపారు. అమరావతి రైతులకు, మహిళలకు కేంద్రమంత్రి అభినందనలు తెలియజేశారు. రూపాయి ఖర్చు లేకుండా వేల ఎకరాలు అమరావతి కోసం సమీకరించిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబుపై ప్రజలు పెట్టుకున్న నమ్మకమే అమరావతి అని వెల్లడించారు. అధికార వికేంద్రీకరణ పేరుతో వైసీపీ మూడు ముక్కలాట ఆడిందని కేంద్ర మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల విలువైన కాలాన్ని వృథా చేసిందన్నారు. ఏపీకి రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితిని వైసీపీ సృష్టించిందని మండిపడ్డారు. రైతుల కన్నీళ్లే ఈ చట్టానికి పునాదిగా మారాయన్నారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత్వం ఉంటే పెట్టుబడులు రావని తెలిపారు. రాజధాని నిర్ణయం.. మార్పు.. కేంద్రం పరిధిలోనే ఉంటుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాజధాని లేకుండా ఇన్నేళ్లు రాష్ట్రం గడిపిందన్నారు. చంద్రబాబు ప్రతిపాదించిన అమరావతిని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టి మూడుముక్కలాట ఆడిందన్నారు. ఇందువల్ల వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేశారని అన్నారు. ఓ రకంగా ఇది సుదినమని అన్నారు.

# మార్కాపురం బస్సు ప్రమాదం కేసు... డ్రైవర్ యువరాజు, యజమాని హరికృష్ణారెడ్డి అరెస్ట్

**మార్కాపురం,ఏప్రిల్2(ఆర్ఎన్ఎ):** మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో డ్రైవర్ యువరాజు, బస్సు యజమాని హరికృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 14 మంది ప్రయాణికులు సజీవ దహనమవగా.. మరో 28 మంది గాయపడ్డారు. మార్చి 26న తెల్లవారుజామున మార్కాపురం మండలం రాయవరం సమీపంలో హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలు

### చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు... మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు.... ఏటా ప్రభుత్వం 150కోట్ల భారం.... వెల్లడించిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** ఇచ్చిన హామీ మేరకు చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్అన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ప్రభుత్వం రూ.150కోట్లు పైనే భరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ జగన్ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో గాడిలో పెడుతున్నారని మంత్రి అన్నారు. 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో చేనేతలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీ నేటి నుంచి అమల్లోకి రానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేశ్ వారికి ఇచ్చిన హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి చేర్చిందని తెలిపారు. జగన్ చేసిన నష్టాలను సరిదిద్దుతూనే రైతులు, చేనేతలు, ఆక్వా, సలూన్‌లకు సబ్సిడీలు ఇస్తున్నామని అన్నారు. వినూత్న ఆలోచనలతో సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకుంటున్నామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. చరిత్రలో లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్దఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ సంస్కరణలు ఇంతటితో ఆగేవి కాదని.. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మార్పులు తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఇదిలావుంటే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులతో సమీక్షించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవడానికి పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజకవర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా.. పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లతో పాటు వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్-ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం ఇవ్వాలి. వినియోగదారుల అనుమతితో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.



# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

### 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు.... వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆర్ఎన్ఎ):** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది.

## మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం



**అదిలాబాద్ ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** గురువారం రోజు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆర్ఎం గా డి.విజయభాను బాధ్యతలు చేపట్టారు.అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను మర్యాద పూర్వకంగా కలిసి కలెక్టర్ కు పువ్వుల బొక్కేను అందించినారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్) డి.శ్రీహర్ష ,డిప్యూటీ ఆర్ఎం (మెయింటెనెన్స్) ఎస్ రామయ్య ,డిపో మేనేజర్ జి.ప్రతిమారెడ్డి,ఆఫీసు సిబ్బంది ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



**కోరుట్ల, ఏప్రిల్ 2(నేటి మన దేశమ్ ప్రతినిధి):** అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. గురువారం పట్టణం లోని 13వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టారు. వార్డు ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు స్వీకరించి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గత 24 నెలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రైతుబంధు, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, చేయూత పింఛన్లు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలతో పాటు ఇందిరా మహిళా శక్తి కింద వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత పది సంవత్సరాలుగా పేద, మధ్య తరగతి ప్రజలు ఎదురుచూసే రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసిందని ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా త్వరలోనే రేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత -గంగాధర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 2: పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణిల కాంటాక్ట్ కార్మికుల పని వేళలు మార్పు చేయాలని ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓటు జిఎం బి శ్రీనివాసచారి కి వినతిపత్రం అందజేసిన కాంట్రాక్ట్ కార్మికులు వేసవి నేపథ్యంలో సింగరేణి కాంటాక్ట్ కార్మికుల పని వేళలో మార్పు చేయాలని కోరుతూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో కాంటాక్ట్ కార్మికులు గురువారం సాయంత్రం మణుగూరు ఏరియా ఎస్ ఓ టు జి ఎం బి శ్రీనివాసచారి గారికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షులు మంగీలాల్ మాట్లాడుతూ వేసవి నేపథ్యం మణుగూరులో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయనీ పారిశుద్ధ్య కార్మికులు, రోడ్స్ క్లీనింగ్, ఉద్యానవన (పార్క్ లు) లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇబ్బంది అవుతున్నదన్నారు, మండుతున్న ఎండలు సమయంలో ప్రతి సంవత్సరం కూడా మానవతా దృక్పథంతో మణుగూరు ఏరియాలో కూడా ఉదయం ఆరు గంటలకే పని ప్రారంభించి మధ్యాహ్నానికి ఎండలు ముదిరే సమయానికి పని ముగించేలా పనివేళల్లో మార్పు చేస్తారని ఈ సంవత్సరం కూడా అలా సహకారాన్ని కొనసాగిస్తూ పని వేళలో మార్పు చేయాలని కోరారు అలాగే వివిధ గనులు డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు, ప్రైవేటు వాహన డ్రైవర్లకు, కోల్ ట్రాన్స్ పోర్ట్ ,ఓబి వర్కర్లకు మజ్జిగ మరియు టిఆర్ఎస్ పాకెట్లు అందజేయాలి ,ఓబి వర్కర్లకు సంబంధించి పని ప్రదేశాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలి, వడదెబ్బ నుండి కాపాడుకునేలా మరియు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి,ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కే నాగేశ్వరరావు, యు శివరామకృష్ణ, టి రామకృష్ణ, ఎం గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**





**జగిత్యాల, ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి):**:ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు..ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. అలాగే వీడియోను ప్రదర్శించారు.అనంతరం ఈ కార్యక్రమంలో గ్రామముకు సంబంధించి వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు.రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు.అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు.అలాగే వివిధ పథకాల లబ్ధిదారులు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నేరుగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు.తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు.గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహిస్తారని గ్రామ ప్రజలు గ్రామసభలో పాల్గొని వారి సమస్యలను తెలపాలని అలాగే గ్రామ అభివృద్ధికి సంబంధించిన పథకాల వివరాలను నిధుల వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.అంతకుముందు గ్రామంలో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన కొందరు లబ్ధిదారుల నుండి వారి అనుభవాలను స్వయంగా వారి నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి. నరేష్, డి.పి.ఆర్.వో పి.నరేష్, తహసీల్దార్ వరదన్, ఎంపిడివో రమా దేవి , గ్రామ సర్పంచ్ శంకరయ్య, వివిధ స్థాయిల ప్రజా ప్రతినిధులు, వివిధ స్థాయిల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్సాన్ పల్లి హాస్టల్ వార్డెన్ పై కలెక్టర్ హైమావతి సీరియస్

- ఆకస్మికంగా గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాల సందర్శన
- విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడొద్దు
- హాస్టల్ వార్డెన్ పైన యాక్షన్ తీసుకోవాలని డిసిఒను కలెక్టర్ ఫోన్



**సిద్ధిపేట,ఏప్రిల్ 02 నేటిమనదేశమ్** విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడొద్దని, హాస్టల్ వార్డెన్ నుండి ఉపాధ్యాయుల వరకు అందరూ విధుల్లో సమయపాలన పాటించాలని, ఎవరైనా ఇష్టానుసారంగా వ్యవహరించినా తాను ఉపేక్షించబోనని జిల్లా కలెక్టర్ కె హైమావతి హెచ్చరించారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, పప్పు, బెండకాయ, రసం, పెరుగులను పరిశీలించారు. కూరల నాణ్యత మెరుగు పరచాలని చేసిన కూరలు దాదాపు 40 మంది విద్యార్థులకు సరిపోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం కొలత ప్రకారం ఆహార సరుకులను అందిస్తూ ఆహార పదార్థాలు విద్యార్థులకు సరిపడేంత, రుచికరంగా వండాలని మీ ఇష్టానుసారంగా ఏదో ఒక కూరతో సరి పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూర సరిపడినంత వండలేదని హాస్టల్ వార్డెన్ పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డిసిఒను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడవద్దని విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హాస్టల్ వార్డెన్ నుండి ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

## పన్నుల్లో ముందంజ... అభివృద్ధిలో వెనుకబాటు

**చీకట్లో లాల్‌గాడి మలక్‌పేట్ 15వ వార్డు ప్రజల ఆవేదన**



**శామీర్‌పేట, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** పన్నుల వసూళ్లలో ముందంజలో ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల్లో అలియాబాద్ మున్సిపాలిటీ వెనుకబడి ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా లాల్‌గాడి మలక్‌పేట్ గ్రామంలోని 15వ వార్డు ప్రజలు కనీస మౌలిక సదుపాయాలు లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.వివరాల్లోకి వెళ్తే... విద్యుత్ దీపాలు లేక రాత్రివేళల్లో చీకట్లోనే ప్రజలు సంచరించాల్సి వస్తోంది. రోడ్లు అధ్వాన స్థితికి చేరుకోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో ప్రజల జీవనం దుర్భరంగా మారింది.ఇదిలా ఉండగా, వార్డు సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సిలర్‌ను సంప్రదించాలనుకున్నా వార్డు సభల్లో కూడా అందుబాటులో లేకపోవడం స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులు సభలకు హాజరుకాకపోవడం ఏంటని వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచి ప్రజలను నిర్లక్ష్యం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకంగా టెంట్ హౌస్ రాజు ఇంటి నుంచి ప్రాథమిక పాఠశాల వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కనీస వసతులు లేక రోజువారీ జీవనం కష్టసాధ్యమైందని తెలిపారు.



**"తక్షణమే స్పందించాలి" -- నేమూరి నగేష్** మాజీ వార్డు సభ్యుడు నేమూరి నగేష్ గౌడ్ మాట్లాడుతూ, "మా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమైనవి. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ దీపాలు, రోడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించాలి" అని కోరారు.



**"అభివృద్ధికి పెద్దపీట వేయాలి" -- వేముల హరిబాబు** మాజీ వార్డు సభ్యుడు వేముల హరిబాబు మాట్లాడుతూ, "లాల్‌గాడి మలక్‌పేట్ గ్రామ అభివృద్ధికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలి. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సరఫరా, మంచినీటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో 15వ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

## మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం:

*పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్.*

*ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికతో గ్రామాల్లో సంక్షేమం విస్తరణ:*

*ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరాలి.*

*జిల్లా కలెక్టర్ పి ప్రవీణ్య*




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 02, (నేటి మన దేశమ్)** కొండాపూర్ మండలం తోగార్పల్లి గ్రామంలో గురువారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభను విజయవంతం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు.గ్రామ సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గ్రామ ప్రజలకు వినిపించారు.ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో అమలవుతున్న పలు కీలక పథకాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతి రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ... జిల్లాలో అధిక శాతం అధికారులుగా మహిళలే ఉన్నారని, మహిళలు పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, శానిటేషన్ పనులు, గ్రామపంచాయతీ భవనాలు, సంఘ భవనాలు నిర్మించుకోవచ్చని వివరించారు. ఉపాధి కార్డుదారులకు 100 రోజుల పని కల్పించాలని, వేసవిలో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త వేరు చేసి అందించాలని సూచించారు. గ్రామ సభలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, స్వయం సహాయ సంఘాలకు రుణాలు, డిజిటల్ హెల్త్ కార్డులు, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలను బస్సు, పెట్రోల్ బంక్ యజమానులుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలు అనుకుంటే ఏదైనా సాధించవచ్చునని అన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని, రాబోయే 90 రోజుల్లో శాఖల వారీగా పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలలో అమలవుతున్న పథకాల లబ్ధిదారుల వివరాలను వెల్లడిస్తూ, గ్రామ సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజలు తమ అర్జీలు, అభ్యంతరాలు, సూచనలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి రూ.12,000 చొప్పున రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ 2025-26 యాసంగి సీజన్‌కు రూ.167 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 12649 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసిన 443 ఇండ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం వివిధ దశల నిర్మాణం లోఉన్న ఇండ్లకు రూ.163 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు నిరాశ్రయులకు స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో డిసెంబర్ 2023 నుండి ఇప్పటివరకు దాదాపు 4.98 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.224.68 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1,76,570 మందికి రూ.22 కోట్ల సబ్సిడీ అందించగా, గృహజ్యోతి పథకం కింద 2,17,527 లబ్ధిదారులకు రూ.165.39 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తూ, 2,14,785 టన్నుల కొనుగోలు చేసి రూ.10.73 కోట్ల బోనస్ రైతులకు అందించినట్లు తెలిపారు .చేయూత పథకం, సామాజిక భద్రత పెన్షన్లు, కింద 1,52,571 మందికి రూ.36.02 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. జిల్లా లో 2025-26 ఆర్థిక సంవత్సరం నకుగాను మహిళా శక్తి పథకం కింద 13,525 స్వయం సహాయ సంఘాలకు రూ.801.33 కోట్ల రుణాలు, 15,074 గ్రూపులకు వడ్డీ లేని ఋణాలు రూ.49.70 కోట్ల రూపాయలు అందించడం జరిగింది .ఇందిరమ్మ చీరల పథకం కింద 1,98,560 చీరలు పంపిణీ చేయగా, ఆహార భద్రత కింద 51,490 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, 1,56,720 మందికి లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రతి నెల 9017 మెట్రిక్ టన్నుల సబ్సిడీ బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు . ప్రభుతం కొత్తగా అల్పాహారం పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,దివ్యాంగ విద్యార్థులకు మోటర్ వాహనాల పంపిణీ, మధ్యాహ్నం భోజనం పథకం ఇంటర్నెట్ వరకు విస్తరణ, పంటల సహజ సేంద్రియ వ్యవసాయం పంటల వైవిధ్య కరణ వంటి పథకాలను చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని, గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా సభకు హాజరైన లబ్ధిదారులు రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతులు,సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలను తెలిపి సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం తోగరుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా భవనం పనులను పరిశీలించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ దివ్య దేవరాజన్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పీడీ డీఆర్డీఓ జ్యోతి, గ్రామ సర్పంచ్ దివ్య వాణి ప్రశాంత్ గౌడ్, ఉపసర్పంచ్ , ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వారణాసి ఇప్పుడెందుకు గుర్తుకు వస్తోంది



రామాయణ పార్ట్ 1 టీజర్ వచ్చాక సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతోంది. ముంబైలో దీని స్పెషల్ ప్రీమియర్ చూసిన మీడియా ప్రతినిధులు ఓ రేంజ్ లో ఎలివేషన్లు ఇచ్చాక అంచనాలు పెరిగిపోయాయి.

వాటిని దృష్టిలో పెట్టుకుని చూసిన చాలా మంది నాలుగు వేల కోట్ల స్థాయిలో బొమ్మ కనిపించలేదని పెదవి విరుస్తున్న వైనం ఎక్స్, ఇన్స్ టాలో గమనించవచ్చు. కొన్ని విజువల్స్ ఎక్స్ ట్రాడినరిగా ఉంటే మరికొన్ని టీవీ సీరియల్ తరహాలో ఉన్నాయనే కామెంట్స్ వినిపించాయి. ఫైనల్ అవుట్ పుట్ ఇలాగే ఉంటుందని చెప్పలేం కానీ రిలీజ్ నాటికీ క్వాలిటీలో ఖచ్చితంగా మార్పు ఉంటుంది. ఇదిలా ఉండగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మహేష్ బాబు వారణాసి ప్రస్తావన తెస్తున్నారు కొందరు నెటిజెన్లు. గత ఏడాది హైదరాబాద్ లో లాంచ్ చేసిన టైటిల్ కాన్సెప్ట్ వీడియోని మళ్ళీ షేర్ చేస్తున్నారు. కథలో ఉద్దేశాన్ని, రాజమౌళి ప్రెజెంట్ చేసిన తీరుని ఉదహరిస్తూ జక్కన్నకు సాటివచ్చే వాళ్ళు ఎవరూ లేరంటూ కితాబుల వర్షం కురిపిస్తున్నారు. ఇక్కడ పోలిక సబబని చెప్పలేం కానీ రామాయణ టీమ్ గుర్తుపెట్టుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. రామాయణ రెగ్యులర్ మూవీ కాదు. భారతీయులకు ఒక ఎమోషన్. రాముడి కథను కొన్ని వందల వేలసార్లు చూసినా మళ్ళీ చూసేందుకు సిద్ధంగా ఉంటారు. అలాంటప్పుడు ఇంత పెద్ద క్యాస్టింగ్ ఉన్న గ్రాండియర్ నుంచి విపరీతంగా ఎక్స్ పెక్ట్ చేయడం సహజం. వావ్ అనిపించాల్సిందే. జస్ట్ బాగుందనే మాట సరిపోదు. దానికోసం ఎంత కష్టమైనా పడాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా కొన్ని వేలమంది ఈ ప్రాజెక్టు మీద పని చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరికి ల్యాండ్ మూవీగా నిలిచిపోవాలని నిర్మాత నమిత్ మల్హోత్రా కంకణం కట్టుకున్నారు. అయితే ఏఐ టెక్నాలజీ పెరిగిపోతున్న తరుణంలో డిఎన్ఈజి సంస్థ నుంచి జనాలు బెస్ట్ ఆశిస్తున్నారు. ఆ మోతాదు ఏ మాత్రం తగ్గినా ఒప్పుకునే పరిస్థితి లేదు. రెహమాన్, జిమ్మర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగున్నప్పటికీ ఇంకా హై ఉండాలని మ్యూజిక్ లవర్స్ కోరుతున్నారు. రామాయణ డిస్కషన్ ఇంకెక్కడి దాకా వెళ్తుందో చూడాలి.




## విస్మయపరిచే 'రామ' పరిచయం



బాలీవుడ్ లోనే కాదు భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదయిన సినిమాగా తెరకెక్కుతున్న రామాయణ పార్ట్ 1 టీజర్ ఇవాళ హనుమాన్ జయంతి సందర్భంగా రాముడి పాత్ర పరిచయంతో విడుదల చేశారు. కథగా చెప్పేందుకు కొత్త విషయం లేదు కానీ విజువల్స్ తోనే తమ విజన్ ఏ స్థాయిలో ఉందో చూపెట్టేందుకు ప్రయత్నించారు దర్శకులు నితేష్ తివారి, నిర్మాత నమిత్ మల్హోత్రా. కేవలం రాముడిని చూపించే కాన్సెప్ట్ కాబట్టి ఇతర ఆర్టిస్టులను రివీల్ చేయలేదు. ప్రపంచంలోనే అత్యున్నత విఎఫ్ఎక్స్ కంపెనీల్లో ఒకటైన డిఎన్ఈజి ఈ రామాయణలో భాగస్వామ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. 8 ఆస్కార్ అవార్డులు దక్కించుకున్న ఈ సంస్థ ఎప్పుడూ చూడని గ్రాఫిక్స్ ని ఈ ఎపిక్ డ్రామాలో చూపించబోతున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇక వీడియో విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, జిమ్స్ హ్యామర్ నేపథ్య సంగీతంలో ప్రతి క్షణం ఎలివేట్ అయ్యే స్థాయిలో అబ్బురపరిచే దృశ్యాలు రెండు నిమిషాల ముప్పై ఎనిమిది సెకండ్లు కట్టిపడేస్తాయి. నాలుగు వేల కోట్ల బడ్జెట్ అంటున్నారు కాబట్టి ఆ స్థాయిలో అనిపించాయా అంటే వెంటనే సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ఇది కేవలం శాంపిల్ మాత్రమే. రుచి చెప్పడానికి ఒక్క మెతుకు సరిపోతుంది కానీ ఇలాంటి కంటెంట్ విషయంలో తొందరపడి ఎలాంటి జడ్జ్ మెంట్లు ఇవ్వలేం. పైగా రిలీజ్ ఇంకా చాలా దూరం ఉంది కాబట్టి పరిమితంగా సీన్స్ చూపించాలన్న ఉద్దేశంతో కట్ చేసిన విధానం ఎన్నో విషయాలను దాచి పెట్టిందన్నది వాస్తవం. డేట్ ఇంకా నిర్ధారణగా చెప్పకపోయినా ఇదే సంవత్సరం దీపావళికి విడుదల కావడం పక్కా. మరోసారి దాన్ని టీజర్ లో నొక్కి చెప్పారు. సాయిపల్లవి సీతగా, యాష్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్న రామాయణ ఇకపై ఎవరూ ఇంత గొప్పగా రామకథను చెప్పలేరన్న రీతిలో నితేశ్ తివారి తెరకెక్కిస్తున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఈ స్థాయి అంచనాలను నిలబెట్టుకోగలిగితే వరల్డ్ వైడ్ వసూళ్లతో పెట్టిన పెట్టుబడి రికవరీ చేసుకోవచ్చు. అదే జరిగితే కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టినట్టే.

# శుభసూచకం... ప్రిమియర్లు ఫుల్

వేసవి సీజన్లో కొంచెం ముందుగానే రేసులోకి దిగింది 'ఉస్తాద్ భగత్ సింగ్'. కానీ ఈ చిత్రం టాలీవుడ్‌కు శుభారంభాన్ని అందించలేకపోయింది. ఆరంభ మెరుపుల తర్వాత ఆ సినిమా చల్లబడిపోయింది. తర్వాతి వారం వచ్చిన సినిమాలు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. కానీ ఈ వారం రాబోయే రెండు సినిమాలు మాత్రం ప్రేక్షకుల్లో బాగానే ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. శర్వానంద్ మోటార్ స్పోర్ట్స్ మూవీ 'బైకర్'తో పాటు.. సంగీత్ శోభన్ హీరోగా నటించిన ఫాంటసీ ఎంటర్టైనర్ 'రాకాస' ఈ శుక్రవారం బాక్సాఫీస్ బరిలో నిలిచాయి ఈ రెండు చిత్రాల మీద ఎంతో నమ్మకంగా ఉన్న మేకర్స్ ఒక రోజు ముందే పెయిడ్ ప్రిమియర్స్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లో ఈ రెండు చిత్రాలకు రెండంకెల సంఖ్యలో షోలు పడుతున్నాయి. ముందు రెండు చిత్రాలకూ పరిమిత థియేటర్లలో కొన్ని షోలు వేయాలి అనుకున్నారు. కానీ బుకింగ్స్ ఓపెన్ అయ్యాక ఆ షోలకు వచ్చిన రెస్పాన్స్ చూశాక.. షోలు పెరుగుతూ వెళ్లాయి. 'బైకర్' మూవీకి ముందు ప్రిమియర్ మల్టీప్లెక్స్ థియేటర్లలో మాత్రమే షోలు మొదలుపెట్టి.. ఆ తర్వాత వేరే మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లలో కూడా షోలు ఓపెన్ చేశారు. ఈ చిత్రానికి 30కి పైగానే ప్రిమియర్ షోలు పడుతున్నాయి హైదరాబాద్‌లో. మెజారిటీ షోలు సోల్డ్ ఔట్ దిశగా వెళ్తున్నాయి. ఇక 'బైకర్'తో పోలిస్తే 'రాకాస' చిన్న సినిమా అయినా.. దానికి కూడా పెద్ద సంఖ్యలోనే ప్రిమియర్లు పడుతున్నాయి. ఒక్కో మల్టీప్లెక్సులో రెండు మూడు షోలు వేస్తున్నారు. కొన్ని సింగిల్ స్క్రీన్లలో కూడా షోలు పడుతున్నాయి. దానికీ హైదరాబాద్‌లో షోల సంఖ్య 30 దాటిపోయింది. చాలా షోలు ఫుల్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రెండు చిత్రాలకూ ఏపీలో వైజాగ్, విజయవాడల్లోనూ ప్రిమియర్స్ వేస్తున్నారు. వాటికీ రెస్పాన్స్ బాగుంది. మొత్తానికి ప్రిమియర్స్ బుకింగ్స్ చూస్తుంటే ఎంతో ఆశాజనకంగా ఉంది. రెండూ బలమైన కంటెంట్ ఉన్న సినిమాల్లానే కనిపిస్తున్నాయి. ప్రిమియర్స్ నుంచి పాజిటివ్ టాక్ వస్తే.. శుక్రవారం రెండు చిత్రాలకూ మంచి ఓపెనింగ్స్ ఆశించవచ్చు. వీకెండ్లో థియేటర్లు కళకళలాడొచ్చు.





# బిజినెస్ న్యూస్




## మైనస్ 1526 పాయింట్ల నుంచి 185 -లోకి సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కోలుకుని లాభాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ బలోపేతం కావడం, అన్ని రంగాల్లో ఎంపిక చేసిన స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కారణంగా సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో 1526 పాయింట్ల నష్టం నుంచి సెన్సెక్స్ కోలుకోవడం గమనార్హం. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల (క్రితం ముగింపు 73,134.32) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 71,545.81 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ.. చివరకి 185.23 పాయింట్ల లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.70 పాయింట్ల లాభంతో 22,713 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్లు, బంగారం ఔన్సు 4616 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## లక్ష్యం దాటిన పరోక్ష పన్ను వసూళ్లు.. ఆ ఒక్కటీ మిస్




దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని దాటాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకోగా.. వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయని ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52 లక్షల కోట్లు దాటినట్లు పేర్కొన్నాయి. వాస్తవంగా ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు వెల్లడించకుండా.. ఏ పన్ను రూపంలో ఎంత శాతం పన్ను వసూలైందనే వివరాలను అధికారులు వెల్లడించారు. కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం వసూలైందని, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సీజీఎస్టీ 100.8% వసూలైందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు తెలిపాయి. మిగిలిన అన్ని పన్నులూ లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ.. ఒక్క పాన్ మసాలాపై విధించిన హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. ఈ సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా.. కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## రోడ్‌స్టర్ ధరను రూ.60 వేలు తగ్గించిన ఓలా ఎలక్ట్రిక్



ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన ప్రీమియం మోటార్ సైకిల్ రోడ్‌స్టర్ ఆం 9.1ఎౌష్ట్ర ధరను భారీగా తగ్గించింది. 4680 భారత్‌సెల్‌పై రూపొందిన ఈ బైక్ ధరను ఏకంగా రూ.60 వేలు తగ్గిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.1,89,999 ఉండగా.. రూ.1,29,999కు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఓలా తన గిగా ఫ్యాక్టరీలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బ్యాటరీ సెల్ (4680 భారత్ సెల్‌ను) ఈ మోటార్ సైకిల్‌లో వినియోగించింది. ఈ సెల్ తయారీ వేగవంతం చేసిన నేపథ్యంలో దీని ధరలు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడంలో భాగంగా రోడ్‌స్టర్ మోటార్ సైకిల్ ధరను భారీగా తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. అయితే, ఈ మోటార్ సైకిల్‌ను లిమిటెడ్ టైమ్ విండోలో మాత్రమే కొనుగోలుకు అనుమతిస్తారు. ఏప్రిల్ 3న సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనుగోలు విండోను తెరవనున్నట్లు ఓలా ప్రతినిధి తెలిపారు. రోడ్‌స్టర్ అందుబాటును బట్టి ఎప్పటికప్పుడు పర్చేజ్ విండో సమయాలను వెల్లడిస్తామని పేర్కొంది. ఓలా ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ 9.1 ఒకసారి ఛార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చని కంపెనీ చెబుతోంది. ప్రస్తుత #EndICEAge క్యాంపెయిన్‌లో ఈ బైక్‌కు ఐదింతల డిమాండ్ పెరిగిందని ఓలా పేర్కొంది.

## ఆ ఒక్క ప్రశ్నతో మా సంస్థ ఉద్యోగి రాజీనామాను ఆపాను..



అప్పుడప్పుడే భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ ఎదిగే స్టార్టప్‌లకు ప్రతి ఉద్యోగి కీలకమే. ఒక్క ప్రతిభావంతుడు సంస్థను వీడినా.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమవుతుంది. అలాంటి పరిస్థితే డిజిటల్ క్రియేటివ్స్ సంస్థకు వచ్చింది. కానీ ఆ స్టార్టప్ సీఈఓ ప్రీతీ మాలిక్ అడిగిన ఒక్క ప్రశ్న ఉద్యోగి ఎటూ వెళ్లకుండా ఆపింది ఈ మేరకు ప్రీతి షేర్ చేసిన లింక్డిన్ పోస్టు వైరల్ అవుతోంది. సంస్థ పనితీరుకు సంబంధించిన అంశాలపై ప్రీతీ మాలిక్ ఒక్కో ఉద్యోగితో మాట్లాడాలని సిద్ధమైవచ్చారు. సరిగ్గా అప్పుడే ఒకరు అనూహ్యంగా రాజీనామా లేఖ ఇచ్చారు. అతడు పనిలో ఎంతో చురుగ్గా ఉంటాడని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం ఇష్టం లేక ఒక ప్రశ్న వేశానని చెప్పారు. దానిని ఆమె గేమ్ ఛేంజింగ్ ప్రశ్నగా పేర్కొన్నారు. "మీరు వెళ్లిపోవాలనుకుంటున్నారు కదా..? అసలు మీకు ఎలాంటి రోల్ సరిపోతుందని భావిస్తున్నారు..?అని ప్రశ్నించినట్లు చెప్పారు. దాంతో అతడు రాజీనామా వెనక ఉన్న కారణాన్ని చెప్పేశారు. నన్ను ఆటోమేషన్ వర్క్‌కోసం హైర్ చేసుకున్నారు. ఆ పనిని నేను ఆస్వాదిస్తూ చేస్తున్నా. కానీ దాన్నుంచి దృష్టి మళ్లేలా పదేపదే వేర్వేరు పనులు చేయాల్సి రావడం విసుగుపుట్టిస్తోంది ' అని సమాధానం ఇచ్చారు. "అధిక వేతనం కోసం అతడు సంస్థను వీడటం లేదని నాకు అర్థమైంది. తాను చేస్తోన్న పనుల మధ్య పొంతన లేకపోవడం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారు. మేం అప్పగించిన ఆటోమేషన్ పని విషయంలో అతడిపై ఫిర్యాదుల్లేవు. కానీ తర్వాత అతడిపై పడిన విసుగుపుట్టించే పనుల వల్ల.. ఏకాగ్రత కోల్పోయారు. దాంతో అతడు ఆటోమేషన్ మీద దృష్టి సారించేలా చర్యలు తీసుకున్నాం. ఈ వ్యవహారంలో నాకో విషయం అర్థమైంది. జీతం పెంచడం, ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒక్కటే ఉద్యోగిని సంస్థలో కొనసాగేలా చేయదు. తాము చేస్తోన్న పని తమ ఎదుగుదలకు ఉపయోగపడుతుందా అని ఉద్యోగికి అనిపించడం కూడా కీలకమని గుర్తించాను. ఆ ఒక్క ప్రశ్న కంపెనీకి, ఆ ఉద్యోగికి మేలు చేసింది" అని తన అనుభవాన్ని వెల్లడించారు.

# మహనీయుల స్ఫూర్తితో సామాజిక న్యాయ సాధనకు కృషి చేయాలి

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

**పలువురు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళులు**



**జగిత్యాల, ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి)**::మహనీయుల స్ఫూర్తితో సామాజిక న్యాయ సాధనకు కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులు జగిత్యాల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప సామాజిక విప్లవకారుడిగా, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానేతగా నిలిచారని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు.ప్రస్తుత సమాజంలో కూడా అసమానతలు తొలగించి, ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలంటే మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నుండి స్ఫూర్తి పొందుతూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.ఆనంతరంజిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత మాట్లాడుతూసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ధైర్యం, నిబద్ధత, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చేదిగా ఉండటంతో పాటు సమాజంలో మార్పు తీసుకురావడానికి దోహదపడిందని అన్నారు.ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సక్రమంగా వినియోగించుకుని ప్రజలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహనీయుల ఆశయాలను అందరూ కలసికట్టుగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.సి అభివృద్ధి అధికారి జి. సునీత, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ హకీమ్,జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, గౌడ సంఘ ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహారాజా శ్రీ సర్దార్ పాపన్న గౌడ్ 316వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు



**మందమర్రి. ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో భక్తి, గౌరవ వాతావరణంలో వర్ధంధి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 17వ శతాబ్దంలో మొఘల్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన బహుజన చక్రవర్తి అని, ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించిన ఆయన గోల్కొండ కోటను ఆక్రమించి, స్వతంత్ర రాజ్యాలు స్థాపించారని గుర్తు చేశారు. సర్దార్ పాపన్న గౌడ్ సామాజిక న్యాయం కోసం, పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానుభావుడని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, స్వాభిమానం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి వెంకటేష్ గౌడ్, సావుల వెంక గౌడ్, గౌడిసెల రాజా గౌడ్, గౌడిసెల శంకర్ గౌడ్, వీరగోని భాస్కర్ గౌడ్, గడ్డం రవి గౌడ్, బుర్ర ఆంజనేయులు గౌడ్, పంజాల రాజా గౌడ్, కె వెంక గౌడ్, కత్తి నరస గౌడ్, సింగారపు లక్ష్మణ్ గౌడ్, అరిగెల రమేష్ గౌడ్, తాళ్లపల్లి గంగాగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొని పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అలియాబాద్‌లో వార్డు సభ



**శామీర్ పేట, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** అలియాబాద్ పురపాలక సంఘ పరిధిలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు సభను మున్సిపల్ చైర్పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ సభకు అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రజలకు వివరించారు. చేయూత పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, డ్వాక్రా మహిళలకు రుణాలు, స్త్రీ శక్తి క్యాంటీన్లు, వ్యవసాయ శాఖ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా వివరాల కోసం సంబంధిత కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ చైర్పర్సన్ శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇలాంటి సభలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఇంటి పన్నుల వసూళ్లలో అలియాబాద్‌కు రాష్ట్ర స్థాయిలో 6వ స్థానం**అలియాబాద్ మున్సిపాలిటీ ఆర్థిక సంవత్సరం 2025--26లో ఇంటి పన్నుల వసూళ్లలో విశిష్ట ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 6వ స్థానాన్ని (91.5%) సాధించింది. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లలో కృషి చూపిన బిల్ కలెక్టర్లను అధికారుల సమక్షంలో సన్మానించారు.వసూళ్లలో మొదటి స్థానం వెంకటేష్ (తుర్కపల్లి -- 94%), రెండవ స్థానం అనిల్ రెడ్డి (అలియాబాద్ -- 93%), మూడవ స్థానం ప్రశాంత్ (యాదారం -- 92%) సాధించారు. వీరికి అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ చైర్పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్పర్సన్ కావేటి మాలతి, కౌన్సిల్ సభ్యులు గాదె వెంకటేష్, తూము యమున, గూడె వెంకటేశ్, గుర్క కుమార్, తలారి మౌనిక, కైరా గణేష్,స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మాలతి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహరాజు, డీఈఓడీ సాంబశివరావు, హౌసింగ్ పీడీ రమణమూర్తి, అగ్రికల్చర్ ఏడీ వెంకట్రామ్ రెడ్డి, తహసీల్దార్ సుచరితతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వ పథకాల అమలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఏప్రిల్ 2, నేటి మనదేశమ్:**ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం గురువారం రోజు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామ సభ/వార్డు సభల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుచరిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ లతో కలిసి హాజరై 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరిగాయని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందు కొరకు ప్రభుత్వం 13వేల కోట్ల రూపాయల ఖర్చు చేసిందని తెలిపారు. ఈ నెలలో 3 నెలల రేషన్ బియ్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రాష్ట్రమంతట మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించడం జరిగిందని, తద్వారా ఇప్పటి వరకు 10 వేలకోట్ల రూపాయలు మహిళలకు ఆదా అయ్యాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు వడ్డీలేని రుణాలు కల్పించి వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సహించడం జరుగుతుందని, రుణం పొందిన సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించి మళ్లీ రుణం పొందవచ్చని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని, విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశం కల్పించడం జరిగింది తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రుణమాఫీ కల్పించి రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను కుటుంబ పెద్దగా గుర్తించి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా జిల్లాలోని దాదాపు 6 వేల నుండి 7 వేలమంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతాయని, దివ్యాంగుల పింఛన్ల మంజూరులో దివ్యాంగత్వ పరీక్షల ధ్రువపత్రం ఆధారంగా అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందని, దాదాపు 3 వేల ఇండ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 300 ఇండ్లు పూర్తి చేయబడి బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహార పథకం కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల దివ్యాంగులకు మోటారు సైకిళ్ళు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్నిబట్టి పంట మార్పిడి విధానాన్ని అమలుచేసి ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ పామ్, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై వివరించడం జరుగుతుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణ, పారిశుద్ధ్య అమలు, త్రాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా సీజనల్, అంటు వ్యాధులను నియంత్రించి ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంపొందించవచ్చని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా చెన్నూర్ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కుటుంబ భీమా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి, ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి)**::ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్నదనిరాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూరాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత 24 నెలల కాలంలో నేరెళ్ల గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 134.90 కోట్ల నిధులు అందించామని తెలిపారు.రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతున్నదని మంత్రి వివరించారు.ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో ఉదయం టిఫిన్ సౌకర్యం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని చెప్పారు.కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆర్థిక భారం తగ్గించేందుకు "ఇందిరమ్మ జీవిత ప్రమాద బీమా" పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు మంత్రి తెలిపారు.నేరెళ్ల గ్రామంలో రూ. 200 కోట్ల వ్యయంతో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్" నిర్మాణం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. పేద, గ్రామీణ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను ప్రణాళిక ప్రకారం అమలు చేస్తామని ఆయన తెలిపారు.ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రజలకు అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి.రాజ గౌడ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, డి ఆర్ డి ఓ రఘువరన్, గ్రామ సర్పంచ్ బాల గౌడ్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బల్మూరి అమరేందర్ రావుకు బీజేపీ శ్రేణుల శుభాకాంక్షలు..



**పెద్దపల్లి ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన బల్మూరి అమరేందర్ రావునీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికైన బీజేపీ సీనియర్ నాయకురాలు బల్మూరి వనితని గురువారం వారి నివాసంలో బీజేపీ రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, న్యాయవాదుల సంక్షేమానికి, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కొత్త బాధ్యతల్లో వారు విజయవంతంగా ముందుకు సాగాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుండేబోయిన భూమయ్య, ఊరగొండ అపర్ణ, మెరుగు నరేష్, బోడకుంట సుభాష్, తీగుట్ల నవీన్, అంకరి భరత్, జక్కుల ప్రవీణ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిలో నేటితో ముగిసిన తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి మనదేశమ్ ప్రతినిధి) ఏప్రిల్ 2** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన నేడు చక్ర తీర్థం వేడుక ఘనంగా జరిగింది. ప్రధాన ఆలయంలోని సీతారాములను మంగళ వాయిద్యాల నడుమ పవిత్ర గోదావరి నది వద్దకు తీసుకువెళ్లి పునర్వసు మండపం వద్ద విశేష అభిషేకం నిర్వహించారు. పవిత్ర గోదావరి నది జలాలు, పంచామృతాలతో అభిషేకం నిరూపించారు. అనంతరం సుదర్శన చక్రానికి పవిత్ర గోదావరి నది వద్ద పూజలు నిర్వహించి చక్ర తీర్థం వేడుక నిర్వహించారు. అనంతరం సుదర్శన చక్రం తో పాటు ఆలయ అర్చకులు సిబ్బంది పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. బ్రహ్మోత్సవాలు ఈ రోజుతో పరిసమాప్తి కానున్న నేపథ్యంలో రేపటి నుంచి నిత్య కళ్యాణాలు పున ప్రారంభం కానున్నాయి.


# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

**రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్**



**ములుగు, ఏప్రిల్ 02: (నేటిమనదేశమ్ ప్రతినిధి )**భారత రాజ్యాంగ నిర్మాత .డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ములుగు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ని మర్యాదపూర్వకంగా కలిసి, అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆహ్వానించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎస్పి కి అంబేద్కర్ జయంతి 135వ ఉత్సవ పోస్టర్లు అందజేసి, పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఏప్రిల్ 14 న, ఏటూరునాగారం, వై జంక్షన్లో నిర్వహించనున్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలుకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఆహ్వానం ఇచ్చారు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్. కమిటీ సభ్యులతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ, డా. అంబేద్కర్ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యత వంటి అంబేద్కర్ ఆదర్శాలను ప్రచారం చేయడం లక్ష్యంగా ఉందని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ ఉత్సవాలలో భాగంగా ఏప్రిల్ 14,15,16, తేదీలలో వాలీబాల్ టోర్నమెంట్, సాంస్కృతిక తదితర కార్యక్రమాలు, నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు చిలువేరు అన్నమయ్య కార్యదర్శి వేంపల్లి శంకర్, కోశాధికారి పరికి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన 99 రోజుల ప్రజా పాలన



**కోదాడ ఏప్రిల్.2(నేటి మన దేశం)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా మునగాల మండలం కోదండ రామాపురం గ్రామం రోజు ఉదయం 10 గంటలకు గ్రామసభ గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజల సమక్షంలో జరిగింది ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా మునగాల మండల స్పెషల్ ఆఫీసర్స్ మరియు గ్రామంలోని మహిళలు, గ్రామ పెద్దల సమక్షంలో పలు అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది.మహిళలు గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులని ప్రశ్నించి మరియు పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు గ్రామ కార్యదర్శి మరియు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల ద్వారా పలు సమస్యల్ని అడిగి తెలుసుకుని వాటిని క్లియర్ చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడికి ఉంది అని డ్రైనేజీ సమస్యలు ఏదైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాల్సిందిగా గ్రామ సెక్రెటరీ కోరారు. గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ గ్రామంలోని పలు సమస్యలపై దృష్టి సాధించి ఎండల త్రివ్రత సందర్భంగా గ్రామంలో నీటి వసతి ఏర్పాటు చేసి ఎవరికి ఏ లోటు పాటు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళామణులు యువకులు మునగాల మండల స్పెషల్ ఆఫీసర్లు గ్రామ సెక్రెటరీ సర్పంచ్ ఉప సర్పంచ్ మరియు మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు

# "అంజన్నా" జనమంతా సుభిక్షంగా ఉండేలా చూడూ..

**కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు హనుమాన్ జయంతోత్సవాల్లో నర్సింగరావు ప్రత్యేక పూజలు**





**కోరుట్ల, ఏప్రిల్ 02(నేటి మన దేశమ్ ప్రతినిధి)::** కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలిచే హనుమా "అంజన్నా" జనమంతా సుభిక్షంగా ఉండేలా చూడలన్నా..అని భక్తిశ్రద్ధ లతో ఆంజనేయున్ని వేడుకుంటూ హనుమాన్ జయంతోత్సవాల్లో ఆంజనేయ ఆలయాల్లో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని కోరుట్ల పట్టణ బస్టాండ్ రోడ్డులో గల హనుమాన్ దేవాలయంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత -గంగాధర్ లతో కలిసి ఆంజనేయస్వామి దర్శించుకొని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కోరుట్ల పట్టణంలో గల అతి పురాతనమైన శ్రీ మహాదేవ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానశీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఆ ఆంజనేయ స్వామి కృపా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం అనిల్, 17వ వార్డు కౌన్సిలర్ సోగ్రాబీ, మహాదేవ స్వామి ఆలయ చైర్మన్ చెన్నవేని రాములు, మాజీ చైర్మన్ పిట్టల నరేష్, హనుమాన్ దేవాలయ ఈఓ ఎం. విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ పేడిపల్లి నర్సయ్య, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, ఆలయాల ధర్మకర్తలు, హనుమాన్ దీక్ష స్వాములు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**జూబ్లీహిల్స్ ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్ ప్రతినిధి)** ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ఎర్రగడ్డ వికాస్ పూరి హనుమాన్ ఆలయంలో స్వామి వారికి ప్రదించారు. గురువారం శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఎర్రగడ్డ డివిజన్ లోని శాస్త్రి నగర్ మరియు ఆనంద్ నగర్ వికాస్ పూరిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..శ్రీ హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నాను. ధర్మం, న్యాయం మార్గంలో ముందుకు సాగాలని ఈ పర్వదినం సందర్భంగా అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు.

# వేములవాడలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం





**వేములవాడ, ఏప్రిల్ 2: నేటి మన దేశమ్ ప్రతినిధి** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం భాగంగా వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 25వ వార్డులో నిర్వహించిన సభలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చ జరిగింది.సభలో పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు తమలాంటి పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. భాదనవేని మల్లీశ్వరి, తాటికొండ మంజుల, బండారి రాధ, కోనమ్మగారి మేఘన తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, గవర్నమెంట్ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 25వ వార్డులో 19 మందికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి అందించామని, ఇంకా అర్హులైన వారికి కూడా పథకం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసి పట్టణాన్ని సుందరీకరణ చేయడమే లక్ష్యమని చెప్పారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలపై ముందుకు వచ్చి మాట్లాడటం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అల్పాహారం, ఇందిర కుటుంబ జీవిత బీమా, మధ్యాహ్న భోజనం విస్తరణ, విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు, సేంద్రీయ వ్యవసాయం వంటి పథకాల గురించి వివరించారు.మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రజలు తడి-పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోకు అందించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ ఆర్.వి. రాధాభాయి, వైస్ చైర్మన్ నరాల శేఖర్, వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో అర్హులైన ప్రతీ ఒక్కరికి న్యాయం

**- కౌన్సిలర్ తూము మధు**



**వేములవాడ, ఏప్రిల్ 02: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన' ప్రణాళికలో భాగంగా గురువారం స్థానిక వార్డులో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, రాతపూర్వక దరఖాస్తులను స్వీకరించారు. ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వర్తించని వారు, అలాగే రూ. 500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పొందని లబ్ధిదారుల నుండి వివరాలను సేకరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తూము మధు మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందని ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే ఈ ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వార్డు ఆఫీసర్ పరశురాములు, ఎంఎంసి డైరెక్టర్ ఎస్కె సాబీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోడిసేల రేణుక శ్రీనివాస్, చొప్పరి భాస్కర్, ఎస్కె పర్వీన్ తదితరులు పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు.ఆశా వర్కర్లు లత, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది నిమ్మిశెట్టి శేఖర్ ఈ కార్యక్రమంలో భాగస్వాములై దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షించారు. వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# టీఎన్జీవోఎస్ అధ్యక్షుడికి ఘన సన్మానం



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 02: నేటి మన దేశమ్ ప్రతినిధి** టీఎన్జీవోఎస్ కేంద్ర సంఘ అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మారం జగదీశ్వర్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా టిఎన్జీవోస్ యూనియన్ పక్షాన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీఎన్జీవో సంఘం కీలక పాత్ర పోషించిందని, రాష్ట్ర నిర్మాణంలో ఉద్యోగుల భాగస్వామ్యాన్ని గుర్తు చేశారు.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, వారి హక్కులను సాధించడమే సంఘం ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు.ఏ ప్రభుత్వం వచ్చినా, ఉద్యోగుల సమస్యలపై రాజీపడకుండా పోరాడతామని చెప్పారుఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీ ఎలుసాని ప్రవీణ్ కుమార్, కార్యదర్శి గాజుల సుదర్శనం, సహా అధ్యక్షులు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి మహమ్మద్ రియాజ్ పాషా, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల పారితోషికం

**- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**




**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 02: నేటి మన దేశమ్ ప్రతినిధి** రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రహ్ వీర్ పథకం" ద్వారా రూ.25,000/- నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పోలీస్ కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రహ్ వీర్ పథకం"ను అమలు చేస్తోందని తెలిపారు.ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుందనీ, సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.

# సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**



**సంగారెడ్డ్, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02 నేటి మన దేశమ్** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సర్వాయి పాపన్న గౌడ్ 316 వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్, బిసి కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్, కల్లుగీత కార్మికుల అధ్యక్షులు రమేష్, వీరేశం, ఆశన్న, వినయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం -**
**రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**సంగారెడ్డ్, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 2: (నేటి మన దేశమ్)**రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని , పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు.గ్రామసభ తెలంగాణ గీతంతో ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల లబ్ధిదారుల వివరాలను వివరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామంలో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ.3.50 కోట్ల రుణాలు అందించగా, రూ.2.50 లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు భీమా, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఎన్నో అమలు చేస్తున్నట్లు చెప్పారు.అల్మాయిపేట గ్రామంలోని సర్వే నం. 513లో కొత్త కాలనీ ఏర్పాటు చేస్తే రహదారులు, నీటి ట్యాంక్, విద్యుత్ సౌకర్యాలు, ఇళ్ల నిర్మాణం వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, హైవే నుండి అల్మాయిపేట--కొన్యాల వరకు బీటీ రహదారి, అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తామని తెలిపారు.మంజూరైన 7 ఇందిరమ్మ ఇళ్లలో 4 మాత్రమే నిర్మించబడిన నేపథ్యంలో మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వ్యక్తిగతంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు నిర్మించేందుకు ముందుకు వచ్చే వారికి కొత్తగా ఇళ్ల మంజూరు కూడా చేస్తామని తెలిపారు.అందోల్ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని కోరారు. ఆందోల్ నియోజకవర్గంలో త్వరలో ఫార్మసీ కళాశాల స్థాపన జరుగుతుందని, సంగుపేట గుట్ట వద్ద రెండు మూడు పరిశ్రమలు రానున్నట్లు వెల్లడించారు.పేదలకు చెందిన సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్ అయిన విషయంపై ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేసి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూములను అసలు లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని సూచించారు.ప్రభుత్వం చేపట్టిన పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే రెండు నెలల్లో 10 శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు.

# రహమత్నగర్ లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**జూబ్లీహిల్స్ మర్చి 02 ఏప్రిల్ (నేటి మనదేశమ్ ప్రతినిధి)** రహమత్ నగర్ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతివేడుకలు ఘనంగా నిర్వహించారు. రహమత్ నగర్ డివిజన్ లోని ఆంజనేయ స్వామి ఆలయంలో వెంగళరావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ దేదీప్య విజయ్ ముఖ్య అతిధిగా పాల్గొని స్వామి వారికీ ప్రతేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. హనుమంతుడు బలానికి, సాటిలేని భక్తికి, నిస్వార్థ సేవకు ప్రతీక అని ఆయన అన్నారు. శ్రీరాముని చరణాల సేవకుడైన హనుమంతుడి ఆధ్యాత్మిక శక్తి మన అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ కుమార్, బజ్వారాజ్, సుజాత, దుర్గ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో ప్రజలకు ఏసీపి సూచనలు : ఏసీపీ సదానందం



**హుస్నాబాద్ ఏప్రిల్ 02 నేటి మనదేశమ్ :** హుస్నాబాద్ మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో గురువారం జరిగిన గ్రామ సభలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏసీపీ సదానందం మాట్లాడుతూ. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. బాల్యవివాహాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో ఎవరైనా విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్స్ సేవలు మరియు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. ఏదైనా ఆపద సమయం లో తక్షణమే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, సర్పంచ్, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

# భక్తి శ్రద్ధలతో మహంకాళీ జాతర ఉత్సవాలు ప్రారంభం..

**అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం...**





**ఆసిఫాబాద్, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్ ప్రతినిధి ) ::**పవిత్ర చైత్ర పౌర్ణమి సందర్భంగా శ్రీ కనక దుర్గా దేవి స్వయంభూ శ్రీ మహంకాళి దేవస్థానంలో మహంకాళీ అమ్మవారి జాతర ఉత్సవాలు గురువారం భక్తి శ్రద్ధలతో ప్రారంభం అయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో జాతర ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ ప్రారంభించారు. శివ పార్వతుల కళ్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుండి టీటీడీ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు పుసాల మహేష్ శాస్త్రి ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజాది కార్యక్రమాలలో భారీగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించారు....



# పాత కక్షలతో మాజీ సర్పంచ్ కిడ్నాప్: పది మంది నిందితులను అరెస్ట్ చేసిన ముదిగొండ పోలీసులు




**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 2, నేటి మన దేశమ్.** భూ వివాదాల నేపథ్యంలో పండ్రెగుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పాము సిల్వరాజును కిడ్నాప్ చేసిన పది మంది నిందితులను ముదిగొండ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి ఒక ట్రక్కు, కారు, నగదు మరియు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. పండ్రెగుపల్లి గ్రామానికి చెందిన షేక్ ఇబ్రాహీం, షేక్ ఫక్రుద్దీన్ అనే అన్నదమ్ముల మధ్య ఎనిమిది ఎకరాల భూమి పంపకాల విషయంలో గొడవలు ఉన్నాయి. తల్లిదండ్రులను పోషిస్తున్న ఇబ్రాహీంకు గ్రామ పెద్దల నిర్ణయం ప్రకారం మూడు ఎకరాల భూమి ఇవ్వాలని మాజీ సర్పంచ్ సిల్వరాజు మద్దతు పలికారు. అంతేకాకుండా, ఈ ఏడాది జనవరిలో ఫక్రుద్దీన్ వర్గం అక్రమంగా ఫెన్సింగ్ వేస్తుండగా సిల్వరాజు అడ్డుకున్నారు. దీంతో సిల్వరాజు అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నిన ఫక్రుద్దీన్ మరియు అతని కుమారులు, హైదరాబాద్‌కు చెందిన కిరాయి ముఠాకు 15 లక్షల రూపాయల సుపారీ ఇచ్చి చంపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.గత నెల 25న ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సిల్వరాజును నిందితులు అశోక్ లేలాండ్ వాహనంలో కిడ్నాప్ చేసి, ఆపై వాహనాలు మార్చుకుంటూ హైదరాబాద్ తరలించారు. సిల్వరాజు భార్య స్వర్ణలత ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, ఖమ్మం రూరల్ ఏసీపీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను వెంబడించారు. పోలీసుల నిఘా పెరగడంతో భయపడిన నిందితులు సిల్వరాజును హైదరాబాద్‌లోని ఎల్.బి. నగర్ వద్ద వదిలి పారిపోయారు.తప్పించుకునే క్రమంలో నిందితులు హైదరాబాద్ నుండి విశాఖపట్నం వైపు వెళ్తుండగా, తెల్దారుపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో షేక్ ముస్తఫా, షేక్ ఫక్రుద్దీన్, షేక్ ఖాసిం సాహెబ్ సహా మరో ఏడుగురు కిరాయి ముఠా సభ్యులు ఉన్నారు. నిందితుల నుంచి లక్షా ఐదు వేల రూపాయల నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు మరియు రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# కొండగట్టు శ్రీ చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల తీరును పరిశీలన





**జగిత్యాల/కొడిమ్యాల, ఏప్రిల్ 02(నేటి మన దేశమ్ (ప్రతినిధి):** :కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం రాత్రి 11 గంటలకు క్షేత్ర స్థాయిలో కొండ గట్టులో కొనసాగుతున్న హనుమాన్ జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి సందర్శించి భక్తులకు కల్పించిన సౌకర్యాలను ఉత్సవాలు జరుగుతున్న తీరును, దీక్షపరుల మాల విరమణ తీరును, కోనేరు పరిసరాలను, ఆలయ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా మరియు ఆలయ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు పెద్ద మొత్తంలో హాజరవుతున్నారని అందుకు అనుగుణంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, సిబ్బంది తమ కేటాయించిన స్థానాల్లో తమ విధులు నిర్వహించాలని, పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. మాల విరమణ క్యా లైన్లు, కేశఖండన లైన్లు, భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వైద్య శిబిరాలు 24ని7 సిద్ధంగా ఉండాలని, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు బుధవారం రాత్రి సుమారు నాలుగు గంటల పాటు ఆలయ పరిసరాల్లో జయంతి జరుగుతున్న తీరును భక్తులకు కల్పించిన సౌకర్యాలను క్షేత్రస్థాయిలో దగ్గరుండి పరిశీలించారు. ఈ జయంతి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా తగిన అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.హనుమాన్ జయంతి ఉత్సవాలకు హాజరవుతున్న భక్తులు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్ల పట్ల మరియు కల్పించిన సదుపాయాల పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, ఆలయ ఈవో అంజనా రెడ్డి, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపిఓ మదన్మోహన్ ,డిపిఆర్వో నరేష్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఏప్రిల్ 2, నేటి మనదేశమ్:** మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బి. సి. సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్క సైనికులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని, రాజ్యాధికార సాధనపై ప్రజలలో చైతన్యం కలిగించారని, బానిస ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. మహనీయుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, బి సి సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్, బి. సి. సంఘాల ప్రతినిధి కె.లచ్చన్న, గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి..

## -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వార్డు సభల నిర్వహణ ద్వారా వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని బుధవార్ పేట్, మోచి గల్లి లో ఏర్పాటుచేసిన వార్డు సభలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ వార్డు సభ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.., ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకు ఎన్నో పథకాలు అమలు పరుస్తుందని, ప్రజలంతా ఆ పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. క్రమం తప్పకుండా నిర్ణీత వ్యవధిలోపు వార్డు సభలు ఏర్పాటు నిర్వహించి, స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలాన్ని అర్హులైన వారందరూ పొందాలని చెప్పారు. గ్రామ సభలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని అధికారులు ప్రజలకు చదివి వినిపించారు. స్థానిక ప్రజలు వివిధ పథకాల రూపంలో పొందిన లబ్ధి వివరాలు చదివి వినిపించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం, ఇటీవలి జిల్లాకు రెండు స్కోచ్ అవార్డులు లభించడానికి గాను విశిష్ట కృషి చేసిన కలెక్టర్ ను మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లు శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ వార్డు సభలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లు అప్పాల కావ్య, గణేష్ చక్రవర్తి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డు కౌన్సిలర్ లు, స్థానిక ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ

## పొలాస జడ్పిహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల రూరల్, ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి):** :పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణ జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ తెలిపారు.పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా గురువారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.పరీక్షా గదుల్లో వెలుతురు, తాగునీరు, శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.పరీక్షల సమయంలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరీక్షలు నిబద్ధతతో, భాద్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఈ పరిశీలనలో డి.ఈ. వో. కె. రాము ,తహసీల్దార్ వరంధన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామ సభ

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య




**మంచిర్యాల, ఏప్రిల్ 2, నేటి మనదేశమ్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం కిష్టంపేట, తాండూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలకు అధికారులతో కలిసి హాజరై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్ లోని డివిజన్లు, మున్సిపాలిటీలలోని వార్డులలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని, ఈ పథకాల ప్రగతి వివరాలను ప్రజలకు వివరించి పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామసభలు, వార్డు సభల ద్వారా ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా పలు పథకాల లబ్దిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యుత్, పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి:



**నేరెడ్ మెట్, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** పాపన్న గౌడ్ ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని నేరెడ్ మెట్ డివిజన్ బి ఆర్ ఎస్ యువ నాయకుడు జే కే సాయికృష్ణ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నేరెడ్ మెట్ డివిజన్ పరిధిలోని నేరేడ్మెట్ ఎక్స్‌రోడ్డు వద్ద బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 316వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. పాపన్న విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.పాపన్న గౌడ్ ప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జైకే సాయి గౌడ్, మొరిగాడి విజయ్ కుమార్ గౌడ్, బత్తిని నరసింహ గౌడ్, జీకే శంకర్రావు, రాజేష్ గౌడ్, ఎలేందర్ గౌడ్, నవీన్ రామ్‌రాజ్, శ్యామ్ ప్రసాద్ గౌడ్, అవినాష్, రాజు, ఆంజనేయులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా దేవరయాంజాల్ శ్రీ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు



**శామీర్‌పేట, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. భారీగా తరలివచ్చిన భక్తుల మధ్య జాతర, రథోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈవో వీరేశం పర్యవేక్షణలో, దాతల సహకారంతో మార్చి 23న అర్చకులు కందాళ సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ హోమాలు, ప్రత్యేక పూజలు, కోలాటం వంటి సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. నిన్న రాత్రి జాతర ఘనంగా నిర్వహించగా, ఈ రోజు తెల్లవారుజామున రథోత్సవం, చక్రతీర్థం, పూర్ణాహుతి, దోపు సేవ, పుష్పయాగం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, దేవస్థానం మాజీ ఛైర్మన్లు దాసరి గోపాల్ రెడ్డి, పేండం లక్ష్మీనారాయణ, పన్నాల వీరారెడ్డి, పన్నాల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వలందాసు సునీత లక్ష్మి, జాతీయ కళామండలి అధ్యక్షుడు యన్ వై అశోక్, నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మామిడిపల్లి మధుసూదన్ రావు, బర్రెంకబావి కిషోర్ సాయిరెడ్డి, బర్రెంకబావి విష్ణువర్ధన్, పిన్నింటి ధర్మారెడ్డి, వలందాసు మురళి గౌడ్, మిర్యాలకర్ సాయి కుమార్, పన్నాల బాల్ రెడ్డి, పెద్ది కొండల్ రెడ్డి, బెబండి జంగారెడ్డి, పీసరి నవపాల్ రెడ్డి, తిరుపతి శంకర్ గౌడ్, డాక్టర్ సింగం రామరావు, పట్నం నర్సింహారెడ్డి, పోద్దుటూరి వెంకట నారాయణ రెడ్డి, పిన్నింటి చసుధాకర్ రెడ్డి, మోటె బాలయ్య, బర్ల అనంతరెడ్డి, కట్ట రాంరెడ్డి, బక్కోళ్ల శ్రీనివాస్, బర్రెంకబావి పట్టాభి రెడ్డి, పట్నం రాంరెడ్డి, పొట్లచెరువు నాగులు, పన్నాల నితిన్ రెడ్డి, పన్నాల శ్రీపాల్ రెడ్డి, బర్ల నరేందర్ రెడ్డి, కుకూనూర్ వినోద్, రంగప్పగారి నాగరాజ్ గౌడ్, నేమూరి రాంచందర్ గౌడ్, దండోత్కర్ రాజ్ మోహన్, అల్లే గంగాధర్, ఆకుల ఉమాపతి తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్ మిత్రబృందం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేయగా, యన్ వై గిరి బృందం, మహిళా కళాకారులు పాటలు, కోలాటం కార్యక్రమాలతో భక్తులను అలరించారు. ఉత్సవాలలో మాజీ ప్రజాప్రతినిధులు, ధర్మకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వంతో స్పందించి. రక్తదానం అందించి.



**మందమర్రి ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** రామకృష్ణాపూర్: మందమర్రి పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు రామకృష్ణాపూర్లోని సి హెచ్ పి.నందు విధులు నిర్వహించే మాసు తిరుపతి తల్లి లక్ష్మి ఇటీవల ఇంట్లో కింద జారిపోవడంతో ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో హుటా హుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి సర్జరీ నిమిత్తం ఏ పాజిటివ్ రక్తం 2 యూనిట్లు కావాలని బంధువులకు తెలియజేయడంతో వారు స్థానికంగా రామాలయం ప్రాంతంలో ఉండే షారున్ రాజుకి సమాచారం అందించడంతో అయన రామాలయం యూత్ ఆర్గనైజేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి దండు సదానందంకు తెలపడంతో వెంటనే స్పందించిన తాను, మందమర్రిలో ఉండే కే. తిరుపతి మిత్రుడుతో కలసి “2 యూనిట్ల” ఏ పాజిటివ్ రక్తాన్ని ఏరియా ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న పేషెంట్ లక్ష్మికి గురువారం రోజున రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు వారిద్దరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో ఎవరికైనా బ్లడ్ కావాలంటే తమ నంబర్ 9133930348 కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

# 25 రోజుల తర్వాతే గ్యాస్ బుకింగ్



న్యూఢిల్లీ : 25 రోజుల తరువాతే గ్యాస్ రీ ఫిల్ బుకింగ్ చేసుకోవాలని కేంద్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశంలో నెలకొన్న గ్యాస్ కొరతతో సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచుతున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకూ 21 రోజుల తరువాత రీఫిల్ బుక్ చేసుకోవచ్చుననే నిబంధన ఉంది. ఆ నిబంధనను కేంద్రం సవరించింది. రీ ఫిల్ బుకింగ్ గడువును 25 రోజులకు పొడిగించడం ద్వారా ప్రభుత్వం బుకింగ్‌లను నియంత్రిస్తోంది. పూర్తిస్థాయిలో గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతోన్న కేంద్రం మరోవైపు బుకింగ్ సమయాన్ని అమాంతం పెంచడం గృహ వినియోగదారులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో 55 రోజులకోసారి బుక్ చేసుకునేవారు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో 15 రోజులకే బుక్ చేస్తున్నారని, అందువల్లే గడువు పెంచుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.114.5 భారం వేసిన సంగతి తెలిసిందే. గ్యాస్ కొరత, ధరల పెంపు నేపథ్యంలో కమర్షియల్ గ్యాస్ వినియోగించే హోటళ్లు, రెస్టారెంట్లు ధరలను మరింత పెంచే అవకాశముందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

# యుద్ధంపై పార్లమెంటులో చర్చకు కేంద్రం 'నో'

**- అమెరికాకు లొంగిపోయారంటూ ప్రతిపక్షాల ఆగ్రహం**

**- వాడివేడిగా బడ్జెట్ సమావేశాలు**




న్యూఢిల్లీ : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌ల యుద్ధం, ఇరాన్ ప్రతిదాడులు, గల్ఫ్‌లో భారతీయుల పరిస్థితి, దేశంలో ఇంధన సంక్షోభం, ధరల పెరుగుదల తదితర అంశాలపై చర్చకు కేంద్రం నిరాకరించడం పట్ల పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వం.. అమెరికా, ఇజ్రాయిల్‌కు లొంగిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. రెండోదశ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా వివాదాలకు సంబంధించిన అంశాలపై చర్చకు అనుమతి ఇవ్వని కేంద్రప్రభుత్వ వైఖరిపై పార్లమెంటులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చర్చకు అనుమతి ఇవ్వకుండా విదేశాంగ మంత్రి ప్రకటనతో ఈ అంశాన్ని ముగించాలన్న ప్రభుత్వ వైఖరిపై ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. 'దేశం తీవ్రమైన ఇంధన సంక్షోభం, ధరల పెరుగుదల దిశగా పయనిస్తోంది. లక్షలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాలు, ఇరాన్‌లో చిక్కుకుపోయారు. ఈ అంశాలపై వివరణాత్మక చర్చ జరపకపోవడం పట్ల మోడీ ప్రభుత్వం వైఖరి ఆమోదయోగ్యం కాదు' అని ప్రతిపక్ష పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. లోక్‌సభ సోమవారం ప్రారంభం కాగానే గల్ఫ్ యుద్ధం, చమురు ధరలు, భారతీయుల తరలింపు వంటి అంశాలను ప్రతిపక్షం లేవనెత్తింది. దీనిపై సభలో ప్రతిపక్ష సభ్యులు భారీ ఎత్తున నినాదాలు హోరెత్తించారు. ఇరాన్ యుద్ధంపై, పెరుగుతోన్న చమురు ధరలపై చర్చించాలని, అలాగే ఇరాన్ సహా గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయుల్ని రక్షించాలని కోరుతూ సభలో డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్‌నకు మోడీ లొంగిపోయారని విమర్శించారు. ఈ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హోరెత్తించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో పలుమార్లు సభ వాయిదా పడింది. చివరకు మధ్యాహ్నం మూడు గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం సభ మంగళవారానికి వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌పై యుద్ధం మన దేశంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతుందని, ఇప్పటికే స్టాక్ మార్కెట్లు నష్టపోతున్నాయని అన్నారు. చమురు ధరలు కూడా పెరుగుతున్నాయని, ఇవన్నీ ప్రజా సమస్యలే అని రాహుల్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆందోళన కారణంగా సోమవారం స్పీకరు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితిపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఉభయ సభల్లోనూ ప్రకటన చేశారు. మరోవైపు పార్లమెంటు ముఖద్వారం వద్ద కూడా ప్రతిపక్షాలు బ్యానర్లు ఎగురవేశారు. 'గల్ఫ్ కాలిపోతోంది, చమురు ధరలు పెరుగుతున్నాయి, భారతీయులు చిక్కుకుపోయారు' అని బ్యానర్‌లో రాసి ఉంది. బడ్జెట్ సమావేశాల మొదటి దశలో నిరసన తెలిపినందుకు సస్పెండ్ అయిన ఎంపిలు కూడా పార్లమెంటు వెలుపల నిరసనలో పాల్గొన్నారు.

# మౌంట్ ఎవరెస్ట్‌లో భారీ మోసం

**- రూ. 167 కోట్లు దందా బహిర్గతం**



ఖాట్మండు : ప్రపంచంలోనే ఎత్తైన శిఖరం మౌంట్ ఎవరెస్ట్ ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయి బీమా మోసం వెలుగులోకి వచ్చింది. సుమారు రూ. 167 కోట్ల మేరకు ఈ మోసం జరిగినట్లు 'ది ఖాట్మండు పోస్ట్' వెల్లడించింది. ఈ కేసులో ట్రెక్కింగ్ కంపెనీల యజమానులు, హెలికాప్టర్ ఆపరేటర్లు సహా 32 మందిపై నేపాల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం, గైడ్‌లు పర్యాటకుల ఆహారంలో బేకింగ్ సోడా కలిపి వారిని అనారోగ్యానికి గురిచేస్తున్నారు. దీంతో పర్యాటకులు తీవ్రమైన కడుపునొప్పి, జీర్ణ సమస్యలతో బాధపడుతూ ఖరీదైన హెలికాప్టర్ అత్యవసర సేవలను వినియోగించుకునేలా చేస్తున్నారు. ఈ పరిస్థితిని 'ఆల్టిట్యూడ్ సిక్‌నెస్'గా చూపించి అంతర్జాతీయ బీమా సంస్థల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పర్యాటకులను బలవంతంగా హెలికాప్టర్ అంబులెన్స్‌లలో ఎక్కించి, నకిలీ వైద్య, విమాన పత్రాలతో మోసం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. జనవరి 1న ప్రారంభమైన దర్యాప్తులో మూడు ప్రముఖ పర్వత రక్షణ సంస్థలకు చెందిన ఆరుగురు ఉన్నతాధికారులను అరెస్టు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# అమెరికాపై కనకవర్షం..

# వెనెజువెలా నుంచి రూ.923 కోట్ల విలువైన బంగారం



అమెరికాపై కనకవర్షం కురుస్తోంది. వెనెజువెలా నుంచి 100 మిలియన్ డాలర్ల (రూ.923 కోట్లు) విలువైన బంగారం యూఎస్‌కు వచ్చింది. ఈ విషయాన్ని అగ్రరాజ్య హోం మంత్రి డగ్ బర్గమ్ ధ్రువీకరించారు. "శుక్రవారం ఆ బంగారం వచ్చింది. ఇంకా ఆ దేశంలో 500 బిలియన్ డాలర్ల విలువైన బంగారం వనరులు ఉన్నాయి" అని వెల్లడించారు. వెనెజువెలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని బంగారం మైనింగ్ కంపెనీ మినర్వెన్‌తో లావాదేవీలకు అనుమతిస్తూ అమెరికా ఇప్పటికే లైసెన్స్ జారీ చేసింది. ఆ సంస్థతో కలిసి తవ్వకాలు చేపట్టింది. ఇటీవల వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్‌తో బర్గమ్ భేటీ అయ్యారు. అలాగే అమెరికా మైనింగ్, మినరల్ కంపెనీలతోనూ చర్చలు జరిపారు. ఈ పరిణామాల తర్వాతే మంత్రి స్పందన వచ్చింది. ఖనిజ సంపన్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు భద్రత కల్పిస్తామని డెల్సీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో గెరిల్లా దళాలు, ఇతర వర్గాలు చురుగ్గా ఉంటాయి. ఎఇక, తాజా లైసెన్స్ కింద ఉత్తరకొరియా, రష్యా, ఇరాన్, క్యూబాకు చెందిన వ్యక్తులు, సంస్థలతో మినర్వెన్ ఒప్పందాలు చేసుకోవడంపై నిషేధం ఉంది. ఎ

వెనెజువెలాలో సమృద్ధిగా ఉన్న కీలక ఖనిజాలపై చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కొనేలా ట్రంప్ యంత్రాంగం ఈ చర్యలు తీసుకుంటోంది. డ్రగ్స్ అక్రమ రవాణా పేరు చెప్పి ఆ దేశ నాయకుడు నికొలస్ మదురోను అమెరికా బంధించి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీనివెనక ప్రధాన ఉద్దేశం చైనాను ఈ దేశాలకు దూరం పెట్టడమే. లాటిన్ అమెరికా దేశాల్లో డ్రాగన్ ప్రాబల్యం క్రమంగా పెరుగుతూ వస్తోంది.

అది అగ్రరాజ్యాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. దాంతో ఆయా దేశాల్లో వనరులను నియంత్రణలోకి తెచ్చుకునేందుకు తన అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకునే పనిలో ఉంది.

# 7 గంటలపాటు ప్రయాణించి వెనక్కి మళ్లిన ఇండిగో విమానం



న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఢిల్లీ నుంచి మాంచెస్టర్ కు బయలుదేరిన ఇండిగో విమానం యూటర్న్ తీసుకుంది. ఇథియోపియా సరిహద్దులో ప్రవేశిస్తున్న సమయంలో గగనతల ఆంక్షల కారణంగా ఏడు గంటల పాటు ప్రయాణించిన విమానం వెనక్కి మళ్లాల్సి వచ్చినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. ఇండిగో తెలిపిన వివరాల మేరకు .... తమ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం సోమవారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి మాంచెస్టర్ బయల్దేరింది. పశ్చిమాసియాలో పలు దేశాల గగనతలాలు మూసి ఉండడంతో.. మరోమార్గంలో గల్ఫ్ ఆఫ్ అడెన్, ఆఫ్రికా మీదుగా ఏడు గంటలపాటు ప్రయాణించి ఇథియోపియా సరిహద్దుకు చేరుకుంది. మరో నాలుగు గంటల్లో మాంచెస్టర్ చేరుకోవాల్సి ఉండగా, చివరి నిమిషంలో ఇథియోపియా ప్రభుత్వం గగనతల ఆంక్షలు విధించింది. దీంతో విమానం వెనక్కి మళ్లాల్సి వచ్చింది. ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించే అవకాశాలపై సంబంధిత అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు విమానయాన సంస్థ అధికారులు వెల్లడించారు.

# బ్రిటన్‌లో టెలిసర్జరీ క్లినికల్ సేవ ప్రారంభం



లండన్: బ్రిటన్‌లో తొలి టెలిసర్జరీ క్లినికల్ సేవ విజయవంతంగా ప్రారంభమైంది. లండన్‌లో నిపుణులైన వైద్యులు దీనిద్వారా జిబ్రాల్టర్‌లో ఉన్న రోగులకు దూర నియంత్రణ సాంకేతికతతో శస్త్రచికిత్స సేవలు అందించగలుగు తున్నారు. జిబ్రాల్టర్ హెల్త్ అథారిటీతో కలిసి లండన్లోని కింగ్స్ కాలేజ్ ఆసుపత్రి, గైస్ ఆసుపత్రిలో కన్సల్టెంట్ యూరాలజిస్టుగా ఉన్న డాక్టర్ కల్యాణ్ గుదారు నాయకత్వంలో ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలుచేశారు. ఇప్పటివరకు జిబ్రాల్టర్‌లోని రోగులు కొన్ని శస్త్రచికిత్సల కోసం లండన్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు టెలిసర్జరీ అందుబాటులోకి రావడంతో అదేస్థాయి నాణ్యమైన సేవలు స్థానికంగానే అందుబాటులోకి వచ్చాయి. ఈ విధానంలో రెండు శస్త్రచికిత్సలు పూర్తికాగా మూడోది త్వరలో చేయనున్నారు. భౌగోళిక దూరాలను అధిగమించి నిపుణ వైద్యసేవల్ని రోగులకు చేరువ చేయడానికి ఆధునిక సాంకేతికత దోహదపడుతోందని డాక్టర్ కల్యాణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రపంచ వైద్యరంగంలో టెలిసర్జరీ వైద్య సేవల విస్తరణకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

### ట్రంప్‌ను వదిలిపెట్టం !

### ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి లారిజాని

టెహ్రాన్ : సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీని హత్య చేసిన అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజాని హెచ్చరించారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఆయన.. తమ నాయకుడి హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'మేం ట్రంప్‌ను వదిలిపెట్టం. ఖమేనీ హత్యకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే.

# పశ్చిమాసియా పరిణామాలు ఆందోళనకరం

## విదేశాంగ మంత్రి జయశంకర్



న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో జరుగుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్‌లు రాజ్యసభలో పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ప్రాంతీయ ఉద్రిక్తతలపై మాట్లాడుతూ .... సమస్యలకు చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కారం కనుక్కోవాలని భారత్ విశ్వసిస్తోందని చెప్పారు. ప్రధాని మోడీ ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని ఆయన అన్నారు. సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి ప్రాంతంలోని పరిస్థితులను అంచనా వేస్తున్నామని, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న దేశాల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని జయ శంకర్ అన్నారు. ఇరాన్‌లో వేలాది మంది భారతీయులు వున్నారని, కొందరు చదువు కోసం వెళ్లగా, మరికొందరు ఉద్యోగాల కోసం వెళ్లారని చెప్పారు.

దేశ ఇంధన భద్రతకు ఈ ప్రాంతం కీలకమని, ఆయిల్-గ్యాస్ సరఫరా కంపెనీలు ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసరం కాని పర్యటనలు మానుకోవాలని భారతీయులకు మంత్రి సలహా ఇచ్చారు.

# నేపాల్‌లో ఆర్ఎస్పీ ప్రభంజనం

**- సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం**

**- ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న బాలేంద్ర!**



కాఠ్‌మాండూ: హిమాలయ దేశం నేపాల్ రాజకీయ నాయకత్వంలో తరం మార్పిడి ఖాయమైంది. దశాబ్దాలుగా దేశంలో వేళ్లూనుకొని ఉన్న పార్టీలను మట్టికరిపిస్తూ.. 'రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ)' తాజా సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించింది. ఆ పార్టీకి చెందిన జెన్ జీ నేత బాలేంద్ర షా (బాలెన్) నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేపాల్ పార్లమెంటులో మొత్తం 275 స్థానాలు ఉన్నాయి. వాటిలో 165 సీట్లకు సభ్యులను ప్రత్యక్ష ఓటింగ్ విధానంలో ఎన్నుకుంటారు. మిగతా 110 స్థానాలను దామాషా విధానంలో భర్తీ చేస్తారు. ఈ నెల 5న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ప్రత్యక్ష ఓటింగ్ జరిగిన 165 స్థానాలకుగాను ఇప్పటి వరకూ 159 చోట్ల ఫలితాలు వెల్లడయ్యాయి. వీటిలో ఆర్ఎస్పీ 122 సీట్లు గెల్చుకుంది. 17 సీట్లతో నేపాలీ కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి నేతృత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్) ఖాతాలో ఇప్పటి వరకు ఎనిమిది సీట్లే చేరాయి. మరో రెండు చోట్ల అది ఆధిక్యంలో ఉంది. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ ఏడు సీట్లు దక్కించుకుంది. కాఠ్‌మాండూ లోయలోని మూడు జిల్లాల్లో మొత్తం 15 నియోజక వర్గాలను ఆర్ఎస్పీ క్లీన్‌స్వీప్ చేసింది. 35 ఏళ్ల బాలెన్ ప్రధాని పీఠమెక్కితే.. నేపాల్‌లో ఆ పదవిని అధిష్ఠించిన తొలి మాధేసీ నేతగా, అత్యంత పిన్న వయసు ప్రధానమంత్రిగా రికార్డు సృష్టిస్తారు. ఝాపా-5 నియోజక వర్గంలో కె.పి.శర్మ ఓలిని బాలెన్ 50 వేలకుపైగా ఓట్ల తేడాతో ఓడించిన సంగతి తెలిసిందే. ఆర్ఎస్పీని 2022లో రవి లమిచానె స్థాపించారు. ఈ ఎన్నికల్లో ఆయన చిత్వాన్-2 నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపొందారు.

# అంతర్జాతీయ న్యాయం చచ్చుబడిపోయింది !

**- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి నేపథ్యంలో రష్యా వ్యాఖ్య**

**- భద్రతా మండలి పి-5 భేటీకి పిలుపు**

మాస్కో / టెహ్రాన్ : ఇరాన్‌పై అమెరికా - ఇజ్రాయెల్ యుద్ధోన్మాదంతో దాడులు కొనసాగిస్తున్న నేపథ్యంలో రష్యా కీలక ప్రకటన చేసింది. అంతర్జాతీయ న్యాయం చచ్చుబడిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలు (పి-5) తక్షణమే భేటీ కావాలని పిలుపునిచ్చింది. ప్రపంచ భద్రత, సుస్థిరతలపై చర్చించేందుకు పి-5లోని రష్యా, చైనా, అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ భేటీ కావాలని తమ అధ్యక్షులు పుతిన్ కోరుకుంటున్నారని రష్యా ప్రభుత్వ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ తెలిపారు. ఆదివారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ పుతిన్ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలు భేటీ కావాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్-19 సంక్షోభ కాలానికి ముందు కూడా ఒకసారి ఇదే ప్రతిపాదనను పుతిన్ చేశారని ఆయన గుర్తు చేశారు. అంతర్జాతీయ న్యాయం అనేది దాదాపు నశించిపోయిందని, ఇలాం టప్పుడు అంతర్జాతీయ న్యాయంలోని నిబంధనలు, సూత్రాలను అనుసరించమని ఇతరులకు ఎలా చెప్పగలమో తనకు అర్థం కావడం లేదన్నారు. కనీసం అంతర్జాతీయ న్యాయం అంటే ఏమిటో నిర్వచించే పరిస్థితిలో కూడా ఇప్పుడెవరూ లేరని ఆయన తెలిపారు. వాస్తవానికి అంతర్జాతీయ న్యాయం అనేది ఇంకా మిగిలి లేదని పెస్కోవ్ పేర్కొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన అఖిల భారత యాదవ సంఘం నాయకులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బండి సదానంద యాదవ్.




**మందమర్రి ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** మందమర్రి పాత బస్టాండ్ లో ఉచిత చలివేంద్రాన్ని యాదవ సంఘం నాయకుడు బండి సదానంద యాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించి అఖిలభాత యాదవ సంఘం నాయకుడు బండి సదానంద యాదవ్ కాకా వెంకటస్వామి జ్ఞాపకార్థం మందమర్రి పాత బస్టాండ్ చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెన్నూరు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని అందులో భాగంగానే ఈరోజు స్వర్గీయ కాకా వెంకట్ స్వామి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో బత్తుల తిరుపతి నాగుల దుర్గయ్య తోట నరహరి రామస్వామి ఆర్ రామ్ రెడ్డి ఆటో యూనియన్ రామిరెడ్డి తోటరాజు తదితరులు పాల్గొన్నారు

## గ్రామాల సమస్యల పరిష్కారమే గ్రామ సభల నిర్వహణ ఉద్దేశ్యం..

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**




**నిర్మల్, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామంలోని సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామ పంచాయతీ భవన ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.., రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఉన్నతికి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు తదితర ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ఎందరో మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. దాదాపు జిల్లాలో 60 వేల రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామాల్లో గల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని కలెక్టర్ వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, గ్రామాలలో నెలకొన్న సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నీ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి గ్రామాలు పట్టణాలు అన్ని పరిశుభ్రంగా మార్చామని వివరించారు. అతి త్వరలోనే వైద్య కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అధికారులంతా జవాబుదారీతనంతో పని చేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామ సభలో భాగంగా, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన గ్రామస్తుల వివరాలు చదివి వినిపించారు. ప్రజల కొరకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాల గురించి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ గ్రామసభలో డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వనిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వార్డులో అన్ని సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తాను

**కౌన్సిలర్ వాడపల్లి రంగమ్మ**






**కోదాడ,ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం కోదాడ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వాడపల్లి రంగమ్మ అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా వార్డు సమస్యల పరిష్కార కృషికై వార్డు ప్రజలు తమ సమస్యలను కౌన్సిలర్ కి విన్నవించుకున్నారు. ప్రజలకు ఫ్రీ కరెంటు బిల్లు, మరియు పెన్షన్లు తమ దృష్టికి వచ్చాయని అన్ని సమస్యల మీద దృష్టి సారించి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మున్సిపాలిటీ అధికారుల సహకారంతో తప్పకుండా తీరుస్తానని వార్డు కౌన్సిలర్ వాడపల్లి రంగమ్మ హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి నేటికి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తయిందని ఆర్థిక సవాళ్ల ను అధిగమిస్తూ గత పాలకుల తప్పిదాలను సరి చేస్తూ సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికి ప్రజా ప్రభుత్వం అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ అనిత,ఇన్చార్జి మాధవి, వార్డు లైన్ మెన్ సురేందర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వాడపల్లి స్టాలిన్, బండమీది మురళి, గౌతమ్,సాయి,వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

## పిప్రిలో సీఎం పర్యటన... ఏర్పాట్ల పరిశీలనకు మంత్రి జూపల్లి



**అదిలాబాద్ ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామనికి ఈనెల 6 తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో కార్యక్రమ వివరాలపై జిల్లా డిసిసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ జాదవ్ మాట్లాడుతూ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి వర్యులు బట్టి విక్రమార్క మల్లు,రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు పి సుదర్శన్ రెడ్డి,జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు రానున్న సందర్భంలో సభా స్థల ఏర్పాట్లను జిల్లా ప్రభుత్వ అధికారులతో ఇప్పటికే పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్,మాజీ టీపిసిసి ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి,డిసిసి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :ఏప్రిల్ 2: పినపాక నియోజకవర్గం ( నేటి మన దేశమ్ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం లోని మణుగూరు ప్రధాన కేంద్రంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజే మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ వికలాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు పాల్గొని, అర్హులైన దివ్యాంగులకు స్కూటీలు, వీల్‌చెయర్లు, ట్రైసైకిళ్లు వంటి ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ: దివ్యాంగుల జీవితాన్ని సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు ప్రతి ఒక్కరు స్వావలంబనతో జీవించేలా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 28,70,000 విలువైన సహాయ ఉపకరణాలను 35 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే కొంతమంది దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా, సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక సహాయ చెక్కులను కూడా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, వారి దైనందిన జీవితంలో సౌలభ్యం కలిగించడమే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ స్వర్ణ జ్యోతి లెనిన్ గారు, ఎమ్మార్వో నరేష్ , ఎంపీడీవో వెంకటేశ్వరరావు , మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ , సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు , . గణేష్ , భాగం రవి , ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న

**నియోజిక ఇంచార్జి పూజల హరికృష్ణ**

**అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు పాపన్న చరిత్ర ఒక ప్రేరణ**



**సిద్ధ్‌పేట ఏప్రిల్ 02 నేటి మనదేశమ్ ప్రతినిధి** :సర్దార్ పాపన్న ఆశయాలతో బహుజన సమాజ అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది అని సిద్దిపేట పట్టణం లో అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు నిరంతర ప్రేరణగా నిలిచిన, తెలంగాణ గడ్డపై తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ఎన్సానపల్లి చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి గౌరవనీయులు పూజల హరికృష్ణ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న అణగారిన వర్గాల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన గొప్ప పోరాట యోధుడని అన్నారు. తెలంగాణ నేలపై సామాన్య ప్రజల కోసం రాజ్యాన్ని స్థాపించి బహుజనుల గౌరవాన్ని కాపాడిన తొలి చక్రవర్తిగా పాపన్న చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పాపన్న గారు చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని, బహుజన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పూజల హరికృష్ణ స్పష్టం చేశారు. పాపన్న ఆశయాలను కొనసాగిస్తూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం మరింతగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్క సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మార్క సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు బొమ్మల యాదగిరి, అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిక్షపతి, డిసిసి మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసా అంజన్న, పూజల గోపికృష్ణ, ఎర్ర మహేందర్, అర్షద్, టీఎంపీస్ జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజ్, గాయశుద్దీన్, వాహబ్, ఎల్లు శ్రీనివాస్ రెడ్డి, అజ్జు యాదవ్, జనార్ధన్ రెడ్డి, అజమాత్, చోట అజమాత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గారి ఆశయాలతో బహుజన సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి-కలెక్టర్ రాజర్షి షా

**-చిత్ర పటాన్ని అందజేసిన దళిత సంఘాలు**



**ఆదిలాబాద్ ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశం మందిరంలో దళిత సంఘాల సమితి ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈనెల 05 తేదీన బాబు జగజీవన్ రామ్ జయంతి, 14 న బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సన్నాహక నిర్వహణ కార్యక్రమం లో ప్రతినిధులు సూచనలు అందిందిన క్రమంలో దళిత సంఘాలు ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కి మహనీయుల చిత్ర పటాలను అందజేశారు. కార్యక్రమం అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ,షెడ్యూల్ క్యాస్ట్ అభివృద్ధి అధికారి సునీత,ఈ.డి. మనోహర్,దళిత సంఘాల ప్రతినిధులు మేకల మల్లన్న ,మల్యాల స్వామి,దుర్గం శేఖర్,బాల శంకర్ కృష్ణ ,రత్న జాడే ప్రజ్ఞ కుమార్,మల్యాల మనోజ్ కుమార్,నక్కారాందాస్, రాజన్న ,అల్లూరి భూమన్న ,ఆయిండ్ల శశికాంత్,దాన్డిగే సందీప్,వాగ్మారే బింరావ్,కొప్పుల రమేష్ ,దళిత సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం ప్రభుత్వాసుపత్రిని ఆకస్మాత్తుగా తనకి చేసిన జిల్లా కలెక్టర్.. అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చేసి ఆసుపత్రుల్లో అంతా కలియతిరిగి వివరాలను అడిగితెలుసుకున్నారు ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా అని పేషెంట్లను అడిగి అలాగే మందుల స్టాక్ గదిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు ఆసుపత్రిలో చికెన్స్ పొందుతున్న రోగుల వివరాలు కూడా తెలుసుకున్నారు ఆసుపత్రికి వచ్చే రోజులు ఎలాంటి అసరం కలగకుండా వైద్య చికిత్సలతో పాటు మాలిక వసూలు కూడా మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు ఆస్పత్రి సమస్యల గురించి డాక్టర్ని అడిగి తెలుసుకున్నారు ఈ పర్యటనలో అశోపురంలో మండల పరిధిలో ఉన్న గొంది గూడెం ఆశ్రమ పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలని అలాగే ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి అసరం కలగకుండా విద్యార్థులని కంటికి రెప్పలా కాపాడుకోవాలని చెప్పారు హాస్టల్లో ఉన్న వార్డెన్ మరియు హెచ్ఎం పరివర్తన సరిగా లేకపోవడంతో వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

## బడుగు - బలహీన వర్గాల ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వం..

**-మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి**



**నిర్మల్, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండే ప్రజా ప్రభుత్వం ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని 36, 37 వార్డుల్లో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి మున్సిపల్ ఛైర్మెన్, వైస్ చైర్మన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికై ఇచ్చిన ధరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.., కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రెండు వందల యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, నూతన రేషన్ కార్డులు, లబ్దిదారులకు సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఇచ్చిన మాట ప్రకారం నెరవేరుస్తుందన్నారు. రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి కాలనీలో డ్రైనేజిలు, సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, టీపీవో హరీష్ , డీ ఈ హరిభువన్, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## జోడు హనుమాన్ దేవాలయంలో ఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి పూజలు ..



**రాజన్న సిరిసిల్ల,( టౌన్) నేటి మన దేశమ్ ప్రతినిధి**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం జోడు హనుమాన్ దేవాలయంలో గురువారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా బి ఆర్ ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు..

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా బూర్గం పహాడ్ మండల కేంద్రంలో గ్రామ సభ.

**సర్పంచ్ మందా నాగరాజు అధ్యక్షతన గ్రామ సభ.**

**సభకు స్పెషల్ ఆఫీసర్ గా పాల్గొన్న బూర్గంపహాడ్ తాసిల్దార్ - కె ఆర్ కె వి ప్రసాద్.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 2: బూర్గంపహాడ్ నేటి ( మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలు, ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యచరణ ప్రణాళిక)లో భాగంగా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో బూర్గం పహాడ్ గ్రామపంచాయతీలో గ్రామస్థాయి ప్రజా పాలన గ్రామసభను సర్పంచ్ మందా నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసారు. గ్రామ పంచాయతీలో పలు అంశాల పై గ్రామ సభ కొనసాగి ంది.ప్రభుత్వ పరంగా వచ్చే నిధులు ఎన్ని,వాటిని ఎలా వినియోగించుకుంటున్నాము అనే అంశంపై ప్రజల సమక్షం లో ఆ శాఖల యొక్క అధికారులు సభా ముఖంగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గా పాల్గొన్న మండల తహసీల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్ పలువురు అధికారులకు పలు సలహాలు ,సూచనలు చేశారు. పేద ప్రజలకు ప్రభుత్వం నుండి అందే ప్రతి రూపాయి వారికి అందే విధంగా అందురు కృషి చేయాలని అన్నారు. వరదలు ఎక్కువగా సంభవించే ప్రాంతం అయిన బూర్గంపహాడ్ మండలంలో ప్రధానంగా (హెడ్ కోటర్) లో విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు 24ఐ7 అందుబాటులో ఉండాలని అన్నారు. రైతన్నలకు సంబంధించిన పశువులకు మెరుగైన వైద్యం అందే విధంగా వెటర్నరీ శాఖ సిబ్బంది కృషి చేయాలని, ఆసుపత్రికి రాలేని పశువులకు ఇంటి వద్ద వైద్యం అందించే హెల్ప్ లైన్ నెంబర్ల పై రైతులకు,పశు యజమానులకు సమాచారం వేగంగా అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో ప్రభుత్వ పరంగా అభివృద్ధి పంట పండి,నిధుల వరద పారుతోంది అని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని,ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో తెలియపరిస్తే అ సమస్యను పరిష్కారం చేసే విధంగా వాటి శాఖల అధికారులకు తెలుపుతామన్నారు.వీధుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తే తమ శాఖల జిల్లా అధికారులకు చర్యలు తీసుకునే విధంగా రిపోర్ట్ పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలలో దూసుకుపోతుందని, ఎందరో పేద ప్రజలకు అండగా నిలబడుతుంది అని అన్నారు, మా గ్రామ పంచాయతీ అన్ని శాఖల అధికారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటుందని, మీరు కూడా మా ప్రజలకు అందుబాటులో ఎప్పుడు ఉండి సేవలు అందించాలి అని, ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు ఎస్సై నాగబిక్షం వాహన దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు అంశాల పై సలహాలు సూచనలు చేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు (అడ్వకేట్) భజన సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో గ్రామాల్లో ప్రజా పండుగ జరుగుతోంది అని అభివృద్ధిలో ప్రభుత్వం దూసుకు పోతున్నది అని,గ్రామానికి కావాలసిన అభివృద్ధి నిధులు మెండుగా ఇచ్చి ఘనత ప్రభుత్వానిదే అని అన్నారు, సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రజలకు వచ్చే ప్రభుత్వ ఫలాలు వారికి అందే విధంగా అవగాహనలు కల్పించాలి అని,తెలియని ప్రజల ఇళ్ళకు స్వయంగా వెళ్ళి తెలుపాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భజన నాగం,రామకృష్ణ,ఆరిఫ్,గౌతమి,వంశీ, రాశేఖర్,నస్రీన్,వీరనారాయణమ్మ అదేవిధంగా బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీ ఈఓ బర్ల ప్రభాకర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా నాయకురాలు బర్ల నాగమణి, పార్టీ నాయకులు భజన సతీష్, భజన ప్రసాద్ అదే విధంగా పలు శాఖల అధికారులు వారి యొక్క సిబ్బంది,గ్రామ పెద్దలు, పలువురు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన నియోజిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ



**సిద్ద్‌పేట ఏప్రిల్ 02 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండవెల్లి గ్రామంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరు అయినా మహిపాల్ రెడ్డి నూతన గృహాన్ని ప్రారంభించిన సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గౌరవనీయులు పూజల హరికృష్ణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – -- పేద ప్రజలకు ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదు, అది వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అర్హ కుటుంబానికి గృహ కలను సాకారం చేస్తూ, సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందని తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి,, డీసీసీ మహిళ అధ్యక్షులు ముద్దం లక్ష్మి,పూజల గోపిక్రిష్ణ,ఎర్ర మహేందర్,ఎల్లు శ్రీనివాస్ రెడ్డి,అజ్జు యాదవ్,జనార్ధన్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# గ్రామీణ ప్రాంతంలోనే అత్యాధునిక వైద్యం.

**టేకులపల్లి రిమ్స్ హాస్పిటల్ లో ఒకే రోజు మూడు ఆపరేషన్లు విజయవంతం...**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 02,( నేటి మనదేశమ్ )**,టేకులపల్లి మండల కేంద్రంలో స్థానిక రిమ్స్ హాస్పిటల్‌లో ఒకే రోజు మూడు కీలక శస్త్రచికిత్సలు గురువారం విజయవంతంగా చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాల సహాయంతో వైద్యులు కష్టమైన ఆపరేషన్లను కూడా చేస్తున్నట్లు టేకులపల్లి రిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. ఆపరేషన్లు హిస్టరెక్టమీ (గర్భ సంచి తొలగింపు),లిపోమా (కణితి గడ్డలు తొలగింపు), అపెండిక్స్ (24 గంటల తీవ్రమైన నొప్పితో అత్యవసర శస్త్రచికిత్స),ఈ మూడు శస్త్రచికిత్సలను ఎంఎస్ సర్జన్స్ బృందం నిపుణులైన గైనకాలజీ, జనరల్ సర్జన్ అనస్తీషియా వైద్యులు సమన్వయంతో నిర్వహించినట్లు రిమ్స్ హాస్పిటల్ డాక్టర్ నరేష్ తెలిపారు. శస్త్రచికిత్సలు పూర్తయ్యాక, పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ నరేష్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా చూసుకుంటున్నారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం స్థిరంగా ఉందని తెలిపారు.ఆదివాసి గిరిజన ప్రాంతమైన టేకులపల్లిలో ఇలాంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రజలకు ఎంతో ఊరటనిస్తోందని, స్థానికులు వైద్యుల సేవలను ప్రశంసిస్తూ, ఆసుపత్రి నిర్వహణపై కృతజ్ఞతలు తెలిపారు.

# బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి...

**-ఆసిఫాబాద్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్**



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్ ప్రతినిధి ) ::** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణిచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక అని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా బిసి అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ గార్లతో కలసి పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్య నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి, సామాన్యుడు కూడా పాలకుడు కావొచ్చని నిరూపించిన గొప్ప వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా పేద ప్రజల పక్షాన నిలిచిన ఆయన చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించడం ద్వారా ఆయన త్యాగాలను స్మరించుకుంటోందని, పాపన్న గౌడ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిసి, ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా గౌడ సంఘం నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన గౌడ సంఘం భవనం,సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి విగ్రహ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు మరువలేనివి'బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**అదిలాబాద్ ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** తెలంగాణ తొలిరాజు బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు,మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి,తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ముందుగల వారి విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది.మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ,డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.కార్యక్రమంలో బీసీ గౌడ్ సంఘం నాయకులు తదితరులు పాట కొన్నారు.అనంతరం జిల్లా కేంద్రంలోని మావల,దస్నాపూర్, ఎంప్లాయ్మెంట్ కాలనీ,గందేవర్ తోట,శాంతినగర్ కాలనీల్లో హనుమాన్ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించన బోరంచు శ్రీకాంత్ రెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు.కాలనీ వాసులతో పాటు ఆలయ సభ్యులు నాయకులు అట్ట గోవర్ధన్ రెడ్డి,రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ అందరికీ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి.కలెక్టర్ రాజర్షిషా

**-గ్రామసభ ముఖ్య ఉద్దేశం- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**




**అదిలాబాద్ మార్చి 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.గురువారం ప్రజాపాలన – ప్రగతి నివేదికలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతువేదిక లో నిర్వహించిన గ్రామసభ కు ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు,కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం,వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.ఉట్నూరు గ్రామ పంచాయతీలో మొదటి విడతగా సుమారు 66 ఇళ్లకు గాను 90 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 16,000 ఇళ్లకు గాను సుమారు 220 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదేళ్లలో ఇళ్లు అందుతాయన్నారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా,అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్,ఎంపీడీవో రామ్ ప్రసాద్,రైతులు,మహిళా సంఘాలు,గ్రామస్తులు,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది,తదితరులు.

# మంచి మనసున్న కంబాల సాయి తేజ విద్య దేశానికి అభివృద్ధిని అన్నారు

**కొత్త గుండ్లపల్లి లోపుట్టినరోజు సందర్భంగా కంబాల సాయి తేజ యాదవ్ స్కూల్ బ్యాగులుపిల్లలకుపంపిణీ చేశారు**



**యాదాద్రి భువనగిరి జిల్లా ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని కొత్త గుండ్లపల్లి గ్రామంలో కంబాల సాయితేజ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త గుండ్లపల్లి ప్రాథమిక పాఠశాల లో స్కూల్ విద్యార్థుల కు స్కూల్ బ్యాగ్ లు పంపిణి చేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, మరియు 7,8 వార్డ్ కౌన్సిలర్ లు పెలిమెల్లి లావణ్య శ్రీధర్ గౌడ్,పేరబోయిన సత్యనారాయణ యాదవ్ స్కూల్ ఛైర్పర్సన్ కంబాల నవనీత,హెడ్మాస్టర్ వెంకన్న మరియు టీచర్ వాని,మరియు కంబాల జహంగీర్,పాండు, పెరబోయిన మహేందర్, బండి అనిల్,బండ రాజు, ముక్కర్ల రాజు, కంబాల నరసింహ... మరియు గ్రామ యువత ఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది.

# కానిస్టేబుల్ కుటుంబానికి భరోసా-ఎస్పీ అఖిల్ మహాజన్

**-లక్ష రూపాయల చెక్కు అందజేత**




**అదిలాబాద్ ఏప్రిల్ 02 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు.ఈ సంవత్సరం జనవరి 5న ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తున్నటువంటి 2012 బ్యాచ్ కానిస్టేబుల్ రాథోడ్ విలాస్(35) గుండెపోటు రావడంతో పరమపదించడం జరిగింది.స్వర్గస్తులైన కానిస్టేబుల్ కు భార్య ,ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఆర్థిక సహాయంలో భాగంగా ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయం నందు రాథోడ్ విలాస్ కుటుంబ సభ్యులైన భార్య జ్యోతి,అన్నయ్య కైలాష్ లకు జిల్లా పోలీసులు ముఖ్య కార్యాలయం నుంచి కార్పస్ ఫండ్ కింద వచ్చిన లక్ష రూపాయల చెక్కును అందజేయడం జరిగింది.కానిస్టేబుల్ మరణం పోలీసు వ్యవస్థకు తీరని లోటుని, బాధిత కుటుంబ సభ్యులకు పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉంటూ అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం ద్వారా రావలసిన ప్రతి ఒక్క లబ్ధి త్వరగా చేకూర్చేలా సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ సులోచన,సీసీ కొండ రాజు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టినప్రజా పాలన 2.వార్డు యాపల్ లో నిర్వహించారు



**మందమర్రి ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ప్రణాళిక వార్డు సభ , కార్యక్రమం భాగంగా మందమర్రి పట్టణ 2వ వార్డు సభ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. మందమర్రి 24వ వార్డులలో ప్రతి వార్డు వార్డుకు గ్రామసభలు జరిగినాయి ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కార్యక్రమంలో వార్డులో ఉన్న ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు 2 వ వార్డు ఇన్చార్జి రాజేష్ ధనుక్ , సీనియర్ నాయకులు వన్నం నరసయ్య , మహిళా నాయకులు గోలేటి లక్ష్మి , సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ రాణి ,2 వ వార్డు ఆఫీసర్ లక్ష్మీనారాయణ ,వార్డు ఆర్పీ జాడి.కోమల , మరియుసీనియర్ నాయకులు,యుత కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకులు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటిక భూమి రక్షణకు గ్రామస్తుల వినతి



**శామీర్ ్పేట, ఏప్రిల్ 02 (నేటి మనదేశమ్):** శామీర్పేట మండలం లో స్మశాన వాటికకు కేటాయించిన ప్రభుత్వ భూమిని రక్షించాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు సుచరిత కు వినతిపత్రం సమర్పించారు. శామీర్పేట సర్వే నంబర్లు 33, 37లో ఉన్న భూమిని పూర్తిగా స్మశాన వాటికకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.అదే సమయంలో సర్వే నంబర్ 30లో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్మాణం వల్ల స్మశాన వాటికకు వెళ్లే దారి అడ్డంకిగా మారుతోందని పేర్కొన్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలను నిలిపివేసి, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమం లో జి. విష్ణు శేఖర్, బాలేష్, మాజీ ఎంపీటీసీ సాయి తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com